
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 28 ఫిబ్రవరి 2024 | 5



సూపరింటెండెంట్‌కు ఏవోగా పదోన్నతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27 : రాజమహేంద్రవరంలోని మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేవీవీ సురేష్‌బాబుకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు గొల్లపూడిలోని డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సురేష్‌బాబును కృష్ణా జిల్లా మచిలీపట్నం డీఎంహెచ్‌వో కార్యాలయం ఏవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడే టీడీపీ-జనసేన బహిరంగ సభ

తాడేపల్లిగూడెంలో ఏర్పాట్లు 8

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నివేదిక ఇవ్వండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక , హేతుబద్ధీకరణ పోలింగ్ కేంద్రాలను గుర్తించడంలో రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలో ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్ , సహాయ రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతో పోలింగ్ కేంద్రాలు, ఫారం 6 ,7,8 పరిష్కార స్థాయి అంశాలపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. 1500 పైబడి ఓటర్లు, ఓటర్ల నివాస ప్రాంతాల నుంచి దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు తగిన కారణాలు తెలియ చేస్తూ ప్రతిపాదనలు పంపాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాలకు 60 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామన్నారు. ఇప్పటి వరకు అనపర్తి నియోజకవర్గం 228 పోలింగ్ కేంద్రాల్లో 67 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారని, రాజమహేంద్రవరంలో 232 పోలింగ్ కేంద్రాలకు 49 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించడం జరిగిందన్నారు. రూరల్‌లో 264 పోలింగ్ కేంద్రాలకు 22 సమస్యాత్మక , కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాల్లో 35 సమస్యాత్మక, నిడదవోలులో 205 పోలింగ్ కేంద్రాల్లో 41 సమస్యాత్మక , గోపాలపురంలో 248 పోలింగ్ కేంద్రాల్లో 62 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నా రు. మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేయాని స్పష్టం చేశారు. డీఆర్వో జి.నరసింహులు, పార్లమెంట్ ఆర్వో ఆర్.కృష్ణనాయక్, డిటీ సునీల్, కమిషనర్ దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.



కాయ్ రాజా కాయ్

- ఎవరి 'లెక్క' వారిది
- వేడెక్కుతున్న రాజకీయం
- జిల్లాలో బెట్టింగ్‌ల జోరు
- నిన్నటి వరకు అభ్యర్థి ఎవరని?
- నేడు గెలుపు ఎవరిదని?
- మిగిలిన సీట్లపై పందేలు
- చేతులు మారుతున్న రూ.కోట్లు

అటు సీట్ల వేట.. ఇటు నోట్లతో బెట్టింగ్ ఆట


(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నోటిఫికేషన్ దారిలో ఉంది. ఏ క్షణంలోనైనా ఉరుముతుంది. దీంతో అభ్యర్థులు, ఆశావహులు 'లెక్క'లు వేసుకోవడంతో పాటు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ప్రావీణ్యానికి పదును పెడుతున్నారు. సీటు నాదని ఒకరు.. బరిలో నేనే అని మరొకరు.. మా పార్టీదే అధికార పీఠమని ఇంకొకరు. ఇలా దూసుకుపోతుండగా.. ప్రజల్లో కూడా చర్చ జోరందుకుంది. ఇది ఓటుకు ఓ వైపు.. మరోవైపు 'కాసులు' కాలు దువ్వడం మొదలైపోయింది. నగదు, నగలు, వాహనాలు, ఆస్తులు.. ఇలా బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. రాష్ట్రమంతా ఓ ఎత్తు అయితే ముందు నుంచీ తూర్పుగోదావరి జిల్లా తీరు 'సెపరేటు'గా నడుస్తోంది. దీంతో పందేలూ పరుగులు పెడుతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంలోనూ తూర్పులో తీవ్ర ఉత్కంఠ నడుస్తూనే ఉంది. అది బెట్టింగ్‌లకు ఊతమిచ్చింది. నిన్నమొన్నటి వరకూ అభ్యర్థి ఎవరు? ఇన్‌చార్జిగా ఎవరిని నియమిస్తారు? వారికే సీటు దక్కుతుందా? అనే అంశాలను బెట్టింగ్‌లకు ప్రమాణాలుగా తీసుకున్నారు. ఇప్పుడు టీడీపీ తమ అభ్యర్థులను ప్రకటించడంతో క్రీడ రసవత్తరంగా మారింది. ఇప్పటికే అభ్యర్థిత్వాలపై సాగుతున్న బెట్టింగ్‌లు గెలుపుపైకి మారింది. టీడీపీ ప్రకటించిన జాబితాలో జిల్లాలోని కీలక స్థానమైన రాజమహేంద్రవరం సిటీకి టీడీపీ అభ్యర్థిని ప్రకటించడం, ఇప్పటికే వైసీపీ నుంచి భరత్‌రామ్ బరిలో ఉండడంతో బెట్టింగ్‌లు కోట్లకు చేరి దూసుకుపోతున్నాయి. గెలుపు మాదేనంటే మాదేనంటూ పందేలు కాస్తున్నారు. ఎవరి 'లెక్క'లు వాళ్లేసుకుని బెట్టింగ్ కడుతున్నారు. టీడీపీ సైకిల్ జోరు మీదుండడం, జనసేనతో సాఫీగా పయనం సాగుతుండడం.. రెండూ కలిసి కచ్చితంగా అధికారంలోకి వస్తాయని బలంగా వినిపిస్తుండడంతో ఇప్పటి వరకూ టీడీపీ అభ్యర్థులపై ఆసక్తి బాగా ఎక్కువైంది.కొందరు టీడీపీ, జనసేన అభ్యర్థుల ప్రకటనతో పార్టీలతో సంబంధం లేని ప్రజానీకం కూడా పందేల్లో ఎంతో కొంత వాటా పెడుతున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని గోదావరికి పశ్చిమంవైపు ఉన్న ఓ నియోజకవర్గంలో సీటుపై బెట్టింగ్‌లు లక్షల్లో జరుగుతున్నాయి.ఈ నియోజకవర్గానికి టీడీపీ -జనసేన, వైసీపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించకపోవడం గమనార్హం. టీడీపీ శనివారం అభ్యర్థులను ప్రకటించడంతో మిగిలిన 4 నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎవరనే విష యంపై తీవ్రంగా చర్చ సాగింది. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం రూరల్ సీటుపై ఇంకా డైలమా కొనసాగుతూనే ఉంది. ఇరుపార్టీల అధినేతలు ఇరువురు అభ్యర్థులకు సీటు మీదేనంటూ హామీ ఇవ్వడంతో ఈ సీటుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే శనివారం ఈ సీటుపై కూడా స్పష్టమైన హామీ వచ్చినట్టు తెలిసినా ఇంకా రకరకాల ప్రచారం సాగుతూనే ఉంది. దీంతో మరింత ఉత్కంఠ నెలకొంది. దీంతో ఇంకా బెట్టింగ్ సాగుతూనే ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ సీటు వ్యవహారం నిడదవోలును తాకడంతో అక్కడా ఇదే పరిస్థితి. వైసీపీలో నియోజకవర్గ ఇన్‌చార్జిలపై మరో విధంగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. వైసీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ఇప్పటి వరకూ ఇన్‌చార్జిలుగా నియమించిన వారికి సీటు ఉంటుందా లేదా అనే దానిపై బెట్టింగ్‌లు జోరుగు సాగుతున్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో టిక్కెట్లు ఎవరికి వస్తాయనే దానిపై కూడా బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. బెట్టింగ్ వ్యవహారమంతా స్మార్ట ఫోన్లలోనే నడిచిపోతోందని చెబుతున్నారు.

నిడదవోలు సీటుపై ఉత్కంఠ

- ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై కసరత్తు
- సీటు తనకే కేటాయించారన్న దుర్గేష్
- శేషారావుకే ఇవ్వాలని టీడీపీ పట్టు
- ఇంకనూ కేటాయించని వైసీపీ సీటు

నిడదవోలు, ఫిబ్రవరి 27 : ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు..రాజమహేంద్రవరం రూరల్ సీటుపై ఉత్కంఠ ఇప్పుడు నిడదవోలు నియోజకవర్గంపై పడింది.. నిన్న మొన్నటి వరకూ రాజమహేంద్రవరం రూరల్ సీటు నాదంటే నాదంటూ అటు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి.. ఇటు తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీపడ్డారు. శనివారం ప్రకటించిన టీడీపీ-జనసేన ఉమ్మడి జాబితాలో ఇరువురు తమ పేర్లు ఉంటాయని ఆశించారు. అయితే అధిష్టానం మాత్రం షాకిచ్చింది..ఇటు రాజమహేంద్రవరం రూరల్ అటు నిడదవోలుకు జాబితాలో చోటివ్వలేదు. ఇదిలా ఉండగా అధినేతలు ప్రకటించకపోయినా రాజమహేంద్రవరం రూరల్ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరికే సీటు ఇచ్చారని.. నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పోటీ చేస్తారనే వార్త హల్‌చల్ చేసింది. దీనికి తగినట్టు కందుల దుర్గేష్ కూడా సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో రిలీజ్ చేశారు. దీంతో నిడదవోలు టీడీపీలో ఒక్కసారిగా ప్రకంపనలు తెచ్చింది. దీంతో ప్రస్తుతం పొలిటికల్ హీట్ నిడదవోలు నియోజకవర్గాన్ని తాకింది. నిడదవోలు నియోజకవర్గం ఆవిర్భవించిన తరువాత 2009,2014 ఎన్నికల్లో టీడీపీ తరపున బూరుగుపల్లి శేషారావు విజయఢంకా మోగించారు. 2019 ఎన్నికల్లో స్వంత పార్టీలోనే అంతర్గత పోరు కారణంగా శేషారావు ఓటమి పాలు కాగా వైసీపీ అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు విజయ సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం



నిడదవోలులోని గణేష్‌చౌక్

సాధించే దిశగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పార్టీ కార్యక్రమాలతో ప్రజల్లోకి దూసుకుపోయారు. మరో పక్క తెలుగుదేశం పార్టీకి చెందిన మరో నాయకుడు కుందుల సత్యనారాయణ తన సొంత వర్గంతో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ఒకానొకదశలో కుందుల సత్యనారాయణ ఎమ్మెల్యే సీటు తనకే వచ్చిందంటూ దేవాలయాల వద్ద కొబ్బరికాయలు కొట్టి హడావుడి చేశారుఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో తాజాగా నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఉమ్మడి అభ్యర్థిగా కందుల దుర్గేష్ పోటీ చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచించినట్టు కందుల దుర్గేష్ మీడియాతో పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు ముక్త కంఠంతో ఎమ్మెల్యే అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు అయితేనే ఫ్యాన్ స్పీడ్‌కు చెక్ పెట్టవచ్చని మరొక అభ్యర్థి అయితే కష్టం అనేది తెలుగుదేశం పార్టీ శ్రేణుల మాట. టీడీపీ కంచుకోట మరో పక్క కాపు సామాజికవర్గం ఓట్లు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో వైకాపా కాపు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడికి చెక్ పెట్టేందుకు తెలుగుదేశం అధిష్టానం కూడా కందుల దుర్గేష్ వైపు మొగ్గు చూపినట్టు సమాచారం. నిన్నటి వరకూ రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గంలో నెలకొన్న ఉత్కంఠ ప్రస్తుతం నిడదవోలులో కొనసాగుతోంది.వైసీపీ టిక్కెట్‌పై ఇప్పటికీ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.ఇప్పటికి అభ్యర్థి ఎవరనేది తేలకపోవడం గమనార్హం.



అనపర్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట కొప్పవరం రోడ్డులో బైఠాయించి డమ్మీ పట్టాల ప్రతులతో నిరసన తెలుపుతున్న రామకృష్ణారెడ్డి, పార్టీ శ్రేణులు

రైతులకు సొమ్ములివ్వకుండా.. పట్టాలెలా ఇస్తారు..

- డమ్మీ పట్టాల తయారీపై విచారణ నిర్వహించి బాధ్యులను శిక్షించాలి
- అనపర్తిలో డమ్మీ పట్టాల ప్రతులను దహనం చేసి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి నిరసన

అనపర్తి, ఫిబ్రవరి 27 : అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో డమ్మీ పట్టాలు తయారు చేస్తున్న అధికారులు.. దీని వెనుక ఉన్న సూత్రధారులపై విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అనపర్తి దేవీచౌక్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం భారీ ర్యాలీ చేశారు.భూసేకరణకు ప్రపోజల్స్ పంపి రైతులకు సొమ్ములు చెల్లించకుండానే అదే సర్వే నెంబర్లతో పట్టాలు తయారు చేయడంపై మండిపడ్డారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద పట్టాల డమ్మీ నకళ్ళను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతరం డమ్మీ పట్టాల తయారీపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు నకళ్ళను అనపర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారిణికి అందజేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఏడాదిన్నర కిందట సేకరించిన భూమికి నేటికీ రైతులకు సొమ్ములు చెల్లించకుండా అవే సర్వే నెంబర్లతో ప్లాట్ నెంబర్లు, సరిహద్దులతో తయారు చేసిన పట్టాలు డమ్మీ కాకుండా మరేమవుతాయని ప్రశ్నించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, గొలుగూరి రామభాస్కరరెడ్డి, మామిడిశెట్టి శ్రీను,నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, తమలంపూడి సత్తిరెడ్డి, పేరిశెట్టి లాలయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సహా 30మందిపై కేసు

అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో డమ్మీ పట్టాలు తయారవుతున్నాయని శనివారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయంలోకి ప్రవేశించి అధికారుల విధులకు భంగం కలిగించారని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామరావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి సహా 30 మందిపై వీఆర్‌వో రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు.ఇప్పటికే 37 అక్రమ కేసులు పెట్టారని దీంతో 38కు చేరాయన్నారు.

అనపర్తి డీటీ శశిధర్ రంగంపేటకు బదిలీ

అనపర్తి, ఫిబ్రవరి 27 : అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.శశిధర్‌ను రంగంపేట తహశీల్దార్ కార్యాలయ డీటీగా బదిలీ చేశారు. రంగంపేట తహశీల్దార్ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న దొరకయ్యను అనపర్తి డీటీగా బదిలీ చేసినట్టు సమాచారం. గత రెండు రోజులు కిందట అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో కలకలం రేపిన డమ్మీ పట్టాల తయారీ కారణంగా ఈ బదిలీలు జరిగినట్టు తెలుస్తుంది.

మార్చి 1న ఎమ్మెల్యే ఇంటికెళ్లి అవినీతిపై చర్చిస్తా

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గత ఐదేళ్ల కాలంలో చేసిన 500 కోట్ల అవినీతిపై బహిరంగంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. తేదీ సమయం చెప్పి రావాలని ఎమ్మెల్యే కోరిక మేరకు మార్చి 1వ తేదీ ఉదయం 11 గంటలకు చర్చకు ఎమ్మెల్యే నివాసానికి వెళతానన్నారు. ఎమ్మెల్యే చేసిన అవినీతిపై ఆధారాలతో సహా వస్తానని ఎక్కడ అవినీతికి పాల్పడిందీ ముందుగానే ఎమ్మెల్యేకు తెలిజేసి చర్చకు వస్తానన్నారు. తాను చర్చించే అంశాల వివరాలను ముందుగానే వెల్లడించడానికి సిద్ధంగా ఉన్నానని..ఎమ్మెల్యే ఎవరిని పంపినా వివరాలు అందిస్తానన్నారు. చర్చకు సిద్ధమంటూ ప్రగల్భాలు పలికిన నాయకుడు విషయాన్ని అప్పుడే రాష్ట్ర పోలీసు ఉన్నాతాధికారులకు, జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు వివరించి పోలీసు బందోబస్తు కోరుతున్నారని తనకు బందోబస్తు అవసరంలేదని అవినీతిని నిరూపించేందుకు ధైర్యంగా వస్తానని రామకృష్ణారెడ్డి అన్నారు. అధికార పక్షం, ప్రతిపక్షం సవాళ్లతో మార్చి 1న అనపర్తిలో ఏం జరగబోతుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

దుర్గేష్‌కు రాజమహేంద్రవరం రూరల్ సీటివ్వాలి



కడియం నుంచి ర్యాలీగా రాజమహేంద్రవరం బయలుదేరిన జనసేన నాయకులు, కార్యకర్తలు

కడియం, ఫిబ్రవరి 27: జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల లక్ష్మీదుర్గేష్‌కే రాజమహేంద్రవరం రూరల్ సీటును కేటాయించాలని జనసైనికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కడియం దేవిచౌక్ సెంటర్ నుంచి రాజమహేంద్రవరం డీలక్స్ సెంటర్ వరకు భారీ పాదయాత్ర చేశారు. మంగళవారం ఉదయం కడియం మండలంలో అన్ని గ్రామాల నుంచి జనసైనికులు,నాయకులు తరలివచ్చి పాదయాత్ర చేశారు.పాదయాత్ర కడియం దేవి చౌక్ నుంచి ప్రారంభమై వేమగిరి, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం కోటిపల్లిబస్టాండ్ మీదుగా డీలక్స్ సెంటర్‌కు చేరుకుంది. సుమారు 15 కిలోమీటర్ల మేర 200 మంది వరకూ పాదయాత్ర చేశారు. రాజమహేంద్రవరం రూరల్ సీటు జనసేన టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా దుర్గేష్‌కు కేటాయిస్తే అఖండ విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ముద్రగడ జమీ, గట్టి నర్సయ్య, పంతం గణపతి, గెడ్డం శివ, చెరుకూరి రామారావు, పాటంశెట్టి రవి, పుల్లా రామారావు, చెక్కపల్లి మురళీకృష్ణ, మల్లు శివ, ఆదిమూలం సాయిబాబా, పాటంశెట్టి రాంజీ, ఇనుమర్తి ప్రభాత్, తోరాటి శ్రీను, ధర్మాసనం శివ, గొల్లపల్లి శ్రీను, నాగిరెడ్డి రామకృష్ణ, జంగా వినోద్, కొప్పిశెట్టి రాజేష్, పుల్లా రామన్న, కర్రి ఎస్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లలైతే ఇలాగే వదిలేస్తారా?

- గోకవరం గురుకులంలో విద్యార్థినికి అనారోగ్యం.. ప్లేట్‌లెట్స్ పడిపోయి నీరసం
- తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం.. ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు



ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

గోకవరం, ఫిబ్రవరి 27 : ఉన్నత చదువుల కోసం స్వగ్రామాలకు దూరంగా, తల్లిదండ్రులను విడిచి గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల కొంతమంది ప్రభుత్వ అధ్యాపకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సొంత పిల్లల్లా సాకాల్సిన వారే వారిపట్ల చిన్నచూపు చూస్తూ పాపాన్ని మూటగట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ అధ్యాపకులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. దీనివల్ల విద్యార్థులు కనీస సౌకర్యాలకు నోచుకోకుండా, అనారోగ్యాలతో కొట్టుమిట్టాడుతున్నారు. గోకవరం మండలం వీరలంకపల్లి గ్రామంలో గల బీఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సుమారు 500 మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడి విద్యార్థినుల పట్ల కళాశాల నిర్వహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనే అపవాదు ఉంది. కొంత కాలం కిందట భోజనం వికటించి పలువురు విద్యార్థినులు ఆసుపత్రి పాలైన సంగతి తెలిసిందే. తాజాగా అదే కళాశాలలో 6వ తరగతి విద్యార్థిని వీరలంకపల్లి గ్రామానికి చెందిన సుంకర భాను అనారోగ్యానికి గురైంది. కళాశాల నిర్వాహకులు సుమారు 10 రోజుల నుంచి గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కానీ భాను ఆరోగ్య పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు మంగళవారం కళాశాల వద్దకు వెళ్లి అధ్యాపకులను నిలదీశారు. ఆ వెంటనే తమ కుమార్తెను తీసుకొని ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అసలు విషయం ఏమిటని వైద్యులను ప్రశ్నించగా రక్తకణాల సంఖ్య తక్కువగా ఉందని చెప్పడంతో విద్యార్థిని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొంతమంది గ్రామ పెద్దలతో కలిసి తల్లిదండ్రులు కళాశాల వద్దకు వెళ్లి నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. విద్యార్థినుల పట్ల ఇంత కఠినంగా వ్యవహరిస్తారా అంటూ మండిపడ్డారు. మీ పిల్లలైతే ఇలాగే వదిలేస్తారా, రోజుల తరబడి రోగం తగ్గకపోయినా ఇంట్లోనే ఉంచుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధ్యాపకుల నుంచి నిర్లక్ష్యపు సమాధా నమే వచ్చింది. దీంతో తల్లిదండ్రులు మరింత రెచ్చిపోయారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ వ్యవహారశైలి కారణంగానే కళాశాలలో ఇటువంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలంటూ కొంత సేపు కళాశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. అనంతరం అనారోగ్యానికి గురైన విద్యార్థిని భానును మెరుగైన వైద్యం నిమిత్తం తల్లి దండ్రులు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వీరలంకపల్లిలో ఉన్న అంబేద్కర్ గురుకుల కళాశాల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో కళాశాలల్లో విద్యార్థి నుల పట్ల అధ్యాపకులు ఏమాత్రం శ్రద్ధ వహించరనే ఆరోపణలు ఉన్నాయి.

నిడదవోలుకు నెల రోజుల్లో ముగ్గురు కమిషనర్లు

- కోన శ్రీనివాస్ ఏరి కోరి వచ్చినా .. నెలలోనే బదిలీ
- పదోన్నతిపై కొవ్వూరు కమిషనర్ శ్రీకాంత్ బాపట్లకు?



శ్రీకాంత్



కోన శ్రీనివాస్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి, 27 (ఆంధ్రజ్యోతి)/నిడదవోలు/కొవ్వూరు : మునిసిపల్ కమిషనర్ల బదిలీల్లో రాజకీయం ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి. జిల్లాలో రెండు మునిసిపాలిటీలు, ఒక కార్పొరేషన్ ఉంది. అయితే నెల రోజుల్లో నిడదవోలు మునిసిపాలిటీ మూడో కమిషనర్ వస్తున్నారు. జనవరి 26న అంటే ఇవాల్టికి సుమారు నెల రోజుల కిందట మునిసిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. అప్పుడు నిడదవోలు కమిషనర్‌గా పిఠాపురం కమిషనర్ కృష్ణవేణిని బదిలీ చేశారు. కానీ ఆమెను నిడదవోలు వైసీపీ నేతలు జాయిన్‌కాకుండా అడ్డుకున్నారనే సమాచారం ఉంది. ఆమె విధుల్లో చేరడానికి విఫల యత్నం చేశారు. కానీ అక్కడి వైసీపీ నేత రికమండేషన్‌తో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీలో పనిచేస్తున్న కోన శ్రీనివాస్ ఇక్కడ కమిషనర్‌గా చేరారు. ఇంకా నెల రోజులు కూడా పూర్తి కాలేదు. ఎందు వల్లనో ఒక్క నెలలోనే ఆయనను బదిలీ చేశారు. మంగళవారం ప్రభుత్వం జారీ చేసిన జీవోలో ఆయనను డిప్యుటేషన్ మీద పార్వతీపురం కమిషనర్‌గా నియమించారు.ఇక్కడకు రేపల్లె కమిషనర్ టి.రాంభూల్ రెడ్డిని బదిలీ చేశారు. కొవ్వూరు కమిషనర్ బి.శ్రీకాంత్ . గ్రూప్ -1 ఆఫీసర్‌గా సుమారు ఏడాదిన్నర కిందట ఇక్కడకు వచ్చారు. ఇక్కడ వివాదాలు లేకుండా పనిచేస్తున్నారనే పేరు తెచ్చుకున్నారు. కానీ ఆయన ను కూడా బాపట్లకు బదిలీ చేశారు. కొవ్వూరు మునిసిపాలిటీ ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. శ్రీకాంత్ కొద్ది నెలల కిందట గ్రేడ్- కమిషనర్‌గా పదోన్నతి పొందారు.ఈ మేరకు బదిలీ చేశారా, లేక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ నేతలకు ఇష్టంగా పనిచేసే వారినెవరినైనా తేనున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎస్బీఐలో చోరీకి విఫలయత్నం





లాకర్లు పగలకొట్టేందుకు చేసిన ప్రయత్నం

బ్యాంకులో సీసీ ఎల్ఈడీ టీవీ పగలగొట్టిన దొంగలు

క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలన

ఎటపాక, ఫిబ్రవరి 27: ఎటపాక మండలం, తోటపల్లి ఎస్బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. బ్యాంకు మెయిన్ గేట్ తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. లోపలికి ప్రవేశించిన దొంగలు నగదు కోసం గాలించి, కంప్యూటర్స్, మోనటర్స్, సీపీయూలను ధ్వంసం చేశారు. బ్యాంకు గదిలో ఉన్న సీసీ పుటేజ్ రికార్డు అయ్యే ఎల్ఈడీ టీవీని సైతం పగలగొట్టారు. ఈ క్రమంలోనే దొంగలు లోపలి గదిలోని నగదు, బంగారు ఉంచే రెండు స్ట్రాంగ్ రూమ్‌లను పగలగొట్టేందుకు యత్నించి, విఫలమయ్యారు. ఉదయాన్నే బ్రాంచ్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారథి బ్యాంకు వద్దకు వచ్చారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బ్యాంకులో నగదు, బంగారం అంతా సవ్యంగా ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత పోలీసులు బ్యాంకు చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. అయితే సీసీ పుటేజీల్లో సుమారు ఆరుగురు దొంగలు ముఖాలు కనబడకుండా రుమాళ్లు కట్టుకుని ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద గొడ్డళ్లు, కర్రలు ఉన్నాయి. పాడేరు నుంచి నలుగురు సభ్యులు క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలను సేకరించారు. అలానే కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్ కూడా వచ్చి, దొంగతనం జరిగిన తీరుపై ఆధారాలు సేకరించారు. అయితే ఇదే బ్యాంకులో పదేళ్ల క్రితం దొంగలు చోరీకి యత్నించి విఫలమయ్యారు. పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. కాగా మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బ్యాంకు సిబ్బందిని విచారిస్తున్న పోలీసులు



స్వామీజీతో జ్యోతుల కుటుంబం

ఘనంగా మల్లికార్జున కల్యాణం

జగ్గంపేట, ఫిబ్రవరి 27: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో కోటి పార్థివ లింగ మహా రుద్రాభిషేకంలో భాగంగా మంగళవారం విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచ గవ్య ప్రాసన, రక్షాబంధము, గోపూజ, మహాన్యాస పారాయణ, రుద్రాభిషేకము, మండప పూజలు, బిల్వార్చన, కుంకుమార్చన, సుబ్రహ్మణ్య ఆవాహనం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీ దేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హిందూ దేవాలయ ప్రతిష్ఠాపన పీఠం పీఠాధిపతి శ్రీ కమలానంద భారతి, శృంగేరి పీఠానికి చెందిన బంగారయ్య శర్మ హాజరై మహా రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. భక్తులు తమ స్వహస్తాలతో కోటి పార్థివ లింగాలకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ దైవ చింతన కలిగిన నాయకుడు కారణంగా సమాజాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భక్తులు పాల్గొన్నారు.



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

గంజాయితో ఐదుగురి అరెస్టు

మోతుగూడెం, ఫిబ్రవరి 27:రెండు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు గంజాయితో ఐదుగురిని అరెస్టు చేశారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద సోదాలు చేస్తుండగా పర్నాటి రవి, మట్వాడి ప్రమోద్‌రెడ్డి అనే ఇద్దరు బైక్‌పై ఒడిసాలోని చిత్రకొండ ఏరియా నుంచి ఆరు కిలోల గంజాయిని తీసుకువస్తుండగా పోలీసులకు దొరికిపోయారు. తర్వాత మరో ప్రాంతంలో సోదాలు చేస్తుండగా, విజయవాడ, గుంటూరు ఏరియాకు చెందిన మేకా అమర్‌రెడ్డి, గిరికిన లక్ష్మణ్, షేక్ మహబూబ్ మైనర్‌తో కలిసి పశువుల్లంకలో నాలుగు కిలోల గంజాయిని తీసుకుని వస్తుండగా డొంకరాయి వద్ద పోలీసులు పట్టుకున్నారు. రెండు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేసినట్లు చింతూరు సీఐ గజేంద్రకుమార్ తెలిపారు..

చమురు, గ్యాస్ నిక్షేపాలపై రౌండ్ టేబుల్ సమావేశం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 27: కాకినాడకు 30 కిలోమీటర్ల దూరాన సముద్ర గర్భం నుంచి ఈ ఏడాది జనవరి 7 నుంచి చమురు ఉత్పత్తి ప్రారంభమైందని, మన తీర ప్రాంతంలో చమురు ఉత్పత్తి కాకినాడ ప్రజలకు జీవనోపాధి అయినందున ఈ నెల 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు కాకినాడ గాంధీభవన్‌లో చమురు, గ్యాస్ నిక్షేపాలపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ ఛైర్మన్ తాటిపాక మధు వెల్లడించారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ హాజరు కానున్నారన్నారు. అదే విధంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు పాల్గొననున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ తెలిపారు.

ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం



రౌతులపూడి, ఫిబ్రవరి 27: రౌతులపూడి గ్రామంలో మోహన రావు అనే వ్యక్తికి చెందిన ఎలక్ట్రికల్ బైక్ సోమవారం రాత్రి దగ్ధమైంది. పార్కు చేసిన కొద్దిసేపటికే బైక్ నుంచి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. సంవత్సరం నుంచి ఎలక్ట్రికల్ బైక్‌ను వినియోగిస్తున్నట్లు మోహనరావు చెప్పారు.

నేటి నుంచి ఉత్తర క్యాబిన్ రైల్వే గేటు మూసివేత

సామర్లకోట, ఫిబ్రవరి 27: సామర్లకోట-పిఠాపురం ట్రాక్‌లో ఉత్తర క్యాబిన్ వద్ద రైల్వే గేట్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 28 బుధవారం ఉదయం 7 గంటల నుంచి మార్చి 6 సాయంత్రం 7 గంటల వరకూ మూసివేయనున్నట్లు సామర్లకోట రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పబ్లిక్ వే బీవీ శ్రీనివాసరావు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ మీదుగా కాకినాడ వెళ్లే వాహనదారులు, కాకినాడ నుంచి గాంధీబొమ్మ మీదుగా సామర్లకోటకు చేరుకునే వాహనదారులు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించాలని రైల్వే అధికారి తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాలను గమనించి రైల్వేశాఖకు సహకరించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
WANTED
★ ఒమేగా హాస్పిటల్ హైదరాబాద్ నందు వృద్ధులకు / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14152
4 Lines CLASSIFIED Rs.230/- Only

బైక్ ఢీకొని యువకుడి మృతి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 27: కాటన్ బ్యారేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన రావిపాటి వెంకటేష్(29) సోమవారం రాత్రి బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి ఇంటికి వస్తుండగా బొబ్బర్లంక బ్యారేజీపై ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. వెంకటేష్ మామయ్య కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కేంద్రంలో ఈసారి

మాదే అధికారం

పార్టీ శ్రేణులు ప్రజలకు చేరువయ్యేలా పని చేయాలి

కేంద్ర పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలి

బీజేపీ శ్రేణులకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిశానిర్దేశం



రాజ్‌నాథ్‌సింగ్‌కు వెంకన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో ఈ సారీ మాదే అధికారమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఏపీలోనూ తమ పార్టీ సత్తా చాటుతుందని చెప్పారు. గోదావరి క్లస్టర్ పరిధిలో బూత్ కమిటీ సభ్యులకు మంగళవారం ఏలూరులో రక్షణ మంత్రి దిశానిర్దేశం చేశారు. అయితే రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఇతర పార్టీలతో పొత్తుకు సిద్ధపడుతుందా ? ఏదైనా కీలక ప్రకటన చేయబోతారా ? అని ఎదురుచూసిన కేడర్‌కు బీజేపీ అగ్రనేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాశనే మిగిల్చారు. ప్రత్యేకించి అధికార వైసీపీని దుయ్యబడుతూనే, కేంద్రంలో అత్యధిక స్థానాలతో ఎన్‌డీఏ ప్రభుత్వం రాబోతోందని కార్యకర్తల్లో జోష్ పెంచారు. అధికార వైసీపీని ఎడాపెడా కడిగేశారు. పేదలకు గుక్కెడు నీళ్లిచ్చే పథకమైన జలజీవన్ కింద రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించడానికి దిక్కు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో అవినీతిమయమే కాకుండా, ఒక విజన్ లేని ప్రభుత్వం ఉందని తూర్పారబట్టారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక వైపు, బీజేపీయేతర పక్షాల అపజయాలను ఏకరవు పెడుతూనే ఇంకోవైపు బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాలను సవివరంగా వివరించారు. "రామ మందిర నిర్మాణంపై కొందరు అనుమానం లేవనెత్తారు. కానీ అయోధ్యలో బాల రాముడిని ప్రతిష్ఠించాం. అనుకున్నది అనుకున్నట్లుగా క్రతువును పూర్తి చేశాం" అని రాజ్‌నాథ్ ప్రకటించినపుడు సభా ప్రాంగణం హర్షధ్వానాలతో మిన్నంటింది. వేదికపై ఉన్న బీజేపీ నేతలు జైశ్రీరామ్ అంటూ నినదించారు. కార్యకర్తల్లో కనిపించిన జోష్‌ను చూసి బీజేపీ ప్రభుత్వం ఏదైతే చెబుతుందో అదే చేస్తుందన్నారు. రాబోయేది ఏపీలో బీజేపీ ప్రభుత్వమేనని, ఏపీ నుంచి ఎంపీలు ఈసారి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తారని కొత్త సంకేతాలిచ్చారు. 'ప్రతి కార్యకర్తకు ఒక లక్ష్యం ఉండాలి. దీనికి సరిపడా శ్రమించాలి. ప్రజల నుంచే బీజేపీ నాయకులను తయారు చేస్తోంది. కొన్ని పార్టీలు మాత్రం కుటుంబం గురించే ఆలోచిస్తాయి. ప్రధాని మోదీ వల్ల నవభారత్ ఏర్పడింది" అని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకపోవడం ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వాల చేతకానితనం అన్నారు. ఏ పార్టీలో కార్యకర్తలుగా ఉన్నామో ప్రతి బీజేపీ కార్యకర్త ఒకసారి అర్థం చేసుకోవాలని, మోదీ సూచనతో రష్యా, ఉక్రెయిన్ మధ్య సాగుతున్న యుద్ధాన్ని నాలుగున్నర గంటలు నిలిపివేశారని, 25 వేల మందికిపైగా దేశీయ విద్యార్థులను తరలించారని, ఇదంతా ప్రసంగాలతో అయిపోదని, ఒక కార్యాచరణ ఉంటేనే సాధ్యమని, అది మోదీ ప్రభుత్వానికే ఉందని అన్నారు. పేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, సొంత ఇళ్లు వంటి పథకాలు అందుబాటులోకి తెచ్చింది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. స్వయం వికసిత భారత్ రావాలనే అందరి ఆకాంక్ష అని, ఇది సాధ్యం కావాలంటే బీజేపీ రాష్ట్రంలోను, కేంద్రంలోను అధికారంలో ఉండాలన్నారు.



సభకు హాజరైన నాయకులు

డబులింజన్ ప్రభుత్వం రావాలి: తపనచౌదరి

రాష్ట్రంలో డబులింజన్ ప్రభుత్వం రావాల్సిందేనని పోలవరం నిర్మాణం సాధ్యం కావాలన్నా, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలన్నా ఇదొకటే ఏకైక మార్గమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి అన్నారు. ఒకప్పుడు రక్షణ విభాగం ఏకే 47 ఆయుధాలను కొనుగోలు చేసేదని, బీజేపీ పాలనలో ఏకే-203 ఆయుధాలను ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం తయారు చేస్తోందని, ఇది ఘనత కాదా అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి అందరూ అందుకోవచ్చన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అందరూ అండగా ఉండాలన్నారు. అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు. సీనియర్ నేత పాకా సత్యనారాయణ మాట్లాడుతూ అందరూ అన్నింటికీ సిద్ధం అంటున్నారని బీజేపీ మాత్రం సేవకే సిద్ధమని ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర సంఘటన్ మంత్రి మధుకర్‌జీ, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు విక్రం కిశోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణప్రసాద్, అంబికా కృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మలా కిశోర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, సుభాష్ రాజు, ఈతకోట తాతాజీ, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వాడపల్లి' అభివృద్ధిపై ధర్మకర్తల మండలి సమీక్ష



ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు అధ్యక్షతన మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలపై ప్రణాళిక రూపకల్పన చేశారు. గోదావరి ఒడ్డున స్వామివారికి చెందిన 8.88 ఎకరాల్లో ఐదు అంతస్తుల్లో 500 పడకల కాటేజీని దేవదాయ శాఖ, దాతల సహకారంతో నిర్మాణం చేపట్టేలా తీర్మానించారు. 2024-25లో జరిగే అధ్యయనోత్సవాలు, కల్యాణోత్సవాల నిర్వహణపై సమీక్షించారు. స్వామివారి ఉత్సవాలను ప్రతిఏటా మాదిరిగానే ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. వచ్చేనెల 15,16 తేదీల్లో ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంపైనా చర్చించారు. 2024-25 బడ్జెట్‌ను ఆమోదించారు. ఆలయం ఎదురుగా కోనేరు నిర్మాణానికి టెండర్లు పూర్తిచేసినట్టు చెప్పారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని వెంకన్న ఆలయంలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టారు. స్వామివారికి చెందిన ఈనాం భూములను స్వాధీనం చేసుకునేందుకు తీర్మానించి కమిషనర్‌కు పంపించారు. భక్తుల సౌకర్యార్థం పలు అంశాలపై చర్చించారు. డిప్యూటీ కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు పి.సురేష్‌రాజు, మన్యం సూర్యకుమారిభాను, మెర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రమూర్తికి కుంభాభిషేకం



కోటనందూరు, ఫిబ్రవరి 27: కోటనందూరు మండలం పాతకొట్టాం గ్రామంలో ఉన్న శ్రీసీతారామచంద్రమూర్తి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా వేదపండితుల ఆధ్వ ర్యంలో కుంభాభిషేకం, సప్తనదీ జలాలు, పంచామృతాలతో అభిషేకం ఘనంగా నిర్వహించారు. హోమం, వార్షిక కల్యాణం ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళా భక్తులు కలశాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ వ్యవస్థాపకుడు యడ్ల చెల్లారావు తెలిపారు. అలాగే జగన్నాథపురం గ్రామంలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన శ్రీహనుమత్ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి, గణపతి, సరస్వతీదేవి విగ్రహ స్థాపన మహోత్సవంలో భాగంగా రామాలయంలో గణపతి హోమం, పుణ్యాహవచనం, దీక్ష ధారణ, గోశాల పూజ తదితర పూజలు వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నర్సరీని సందర్శించిన ఛత్తీస్‌గఢ్ బృందం

కడియం, ఫిబ్రవరి 27: కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జైవిక్ ఖేతి మిషన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ సంజయ్ మలాకర్‌తో పాటు 75 మంది రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా సంజయ్ మలాకర్ మాట్లాడుతూ దేశ, విదేశీ ఉద్యాన సంపద ఒకేచోట ఉన్న ప్రాంతం కడియం అన్నారు. మొక్కల జాతులు, శాస్త్రీయ నామాలు క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. ఉద్యానవన శిక్షకులకు, రైతులకు ఈ ప్రాంతం ఎంతో మేలు చేస్తుందన్నారు. మొక్కల వివరాలను తెలుసుకున్నారు.



ఛత్తీస్‌గఢ్ బృందంలోని సభ్యులు

పిఠాపురంలో భారీ చోరీ

రూ.15 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు.. నగదు అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం, ఫిబ్రవరి 27: పిఠాపురంలో భారీ చోరీ జరిగింది. సుమారు రూ.15 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. పట్టణంలోని రజకవీధిలో వాడపల్లి హేమలత నివాసం ఉంటున్నారు. కుమారుడి వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులంతా కలిసి ఈనెల 21న రాజమహేంద్రవరం వెళ్లారు. అక్కడ పెళ్లి పనులు చూసుకుని మంగళవారం పిఠాపురం తిరిగి వచ్చారు. ఇంటికి వచ్చి చూసుకునేసరికి తాళాలు బద్దలు కొట్టి తలుపులు తొలగించి బీరువాల్లో ఉండాల్సిన 25 కాసుల బంగారు నగలు, రూ.3లక్షల నగదు అపహరించినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్, పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. చోరీ సంఘటనపై హేమలత పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



బంగారు ఆభరణాల బహూకరణ

అన్నవరం, ఫిబ్రవరి 27: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి మంగళవారం విశాఖపట్నానికి చెందిన అజ్ఞాత భక్తుడు స్వామి,అమ్మవార్లు, శంకరుడికి రూ.17.5 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రెండు లక్షలు విరాళంగా అందించారు. వీటిని ఆయన ఆలయ ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో కృష్ణారావుకు అందించగా వారు దాతను అభినందించి ప్రత్యేక దర్శనం స్వామివారి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ భాస్కర్, స్వామీజీ, ఏపీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

పొరపాటున అన్నా.. రాజకీయం చెయ్యొద్దు..

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 27 : మత్స్యకార జాతిపై తాను పొరపాటున అన్నానని.. తన వ్యాఖ్యలు రాజకీయం చెయ్యొద్దని... కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. కాకినాడలో ఎమ్మెల్యే తన నివాసం వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నానన్నారు. కాకినాడలో అన్నికులాలు, మతాల ప్రజలంతా తనకు సమానమేనన్నారు. మత్స్యకార వర్గం అభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నానన్నారు. తన వ్యాఖ్యలను మనస్ఫూర్తిగా వెనక్కి తీసుకుంటున్నానని, అన్యథా భావించవద్దని అన్నారు. మత్స్యకారులను కించపరచాలన్న ఎటువంటి ఉద్దేశం తనకు లేదన్నారు. ఎన్నికల సమయంలో తన వ్యాఖ్యలపై కొంత మంది రాద్ధాంతం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ వివాదానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడలో వెంకటేశ్వరస్వామి గుడి కట్టించిన ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభోత్సవానికి ముందు మాట్లాడుతూ రూ.4 కోట్ల సొంత నిధులతో ఈ గుడి నిర్మించినట్లు వెల్లడించారు. ఈ గుడి శంకుస్థాపన సమయంలో రూ.2కోట్ల నిధులు టీటీడీ మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రస్తావిస్తూ ఈ గుడి నిర్మాణానికి టీటీడీ మంజూరు చేసిన రూ.2కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. దీనికి కౌంటర్‌గా ద్వారంపూడి మాట్లాడుతూ రూ.కోటి పెట్టి గుడి కట్టి రూ.10 కోట్లు దండుకునే జాతి కొండబాబు జాతి అని వ్యాఖ్యలు చేశారు. ఈనెల 17న ఎమ్మెల్యే చేసిన ఈ వ్యాఖ్యలపై అప్పటి నుంచి మత్స్యకార వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.మత్స్యకారులను కించపరచిన ద్వారంపూడి క్షమాపణ చెప్పాలని పలుచోట్ల మత్స్యకార నాయకులు నిరసనలు తెలిపారు. ఈ వివాదం తలెత్తి పది రోజులవుతున్నా ద్వారంపూడి పట్టించుకోకపోవడంతో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ రంగంలోకి దిగి మత్స్యకారులకు రెండు రోజుల్లోగా క్షమాపణ చెప్పకపోతే ఈ నెల 27న ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటిని ముట్టడిస్తామని ప్రకటించింది. ఇదే సమయంలో ఫిషర్‌మెన్ జేఏసీ, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో కాకినాడలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ ద్వారంపూడి వారంరోజుల్లో క్షమాపణ చెప్పకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో వివాదం మరింత తీవ్రతరం కాకుండా ఉండేందుకు మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటుచేసి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు ద్వారంపూడి ప్రకటించారు.

ఏజెన్సీ సమాచారం

పవర్ కెనాల్ నిర్వహణ పనులకు సన్నాహాలు



మోతుగూడెం, ఫిబ్రవరి 27: సీలేరు కాంప్లెక్స్‌లోని డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులకు ఏపీ జెన్‌కో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి పాలనాపరమైన అనుమతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. పవర్ కెనాల్ నుంచి నీటి విడుదల ఆపేశారు. ప్రస్తుతం కెనాల్ అడుగంటిపోవడంతో అత్యవసర పనులు చేపట్టడానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా 16 కిలోమీటర్ల పవర్ కెనాల్‌లో డొంకరాయి డివిజన్ పరిధిలో ప్యానల్స్, అండర్ టన్నెల్స్ పాడైనట్లు గుర్తించారు. వీటికి మరమ్మత్తులు చేయడానికి రూ.20 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్య ఇంజనీర్ కార్యాలయానికి పంపించారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని జెన్‌కో అధికారులు తెలిపారు.

జాబ్‌మేళాలో 144 మందికి ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

చింతూరు, ఫిబ్రవరి27 : చింతూరు ఐటీడీఏ, ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ మంగళవారం ఉమ్మడిగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించింది. మేళాలో హాజరయ్యేందుకు గాను 454 మంది నిరుద్యోగులు రిజిస్టర్ చేయించుకోగా వారిలో ఇంటర్వ్యూలకు 311 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 144 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు సొంతం చేసుకున్నారు. కాగా మరో 48 మంది అభ్యర్థులు రెండో విడత ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో కావూరి చైతన్య మాట్లాడుతూ నిరుద్యోగులు ఇటువంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు హాజరైన 36 మందికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించామని వారిలో నలుగురికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు తేలిందని పీవో తెలిపారు. దీంతో వ్యాధి లక్షణాలపై యువతకు అవగాహన కల్పించామన్నారు. మరో వైపు జాబ్ మేళా వేదిక వద్దనే ఓటు హక్కుపై అవగాహన కల్పించి కొత్తగా 50 మంది యువకులకు ఓటు రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. జాబ్ మేళాలో పాల్గొన్న నిరుద్యోగులకు జమాల్ ఖాన్ ట్రస్టు మజ్జిగ సరఫరా చేసింది. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా, జిల్లా ఉపాధి అధికారి సంగీత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళీ, ఎంపీపీ అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పోస్టు కార్డు ఉద్యమం



పోస్టుకార్డులను చూపిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కూనవరం,ఫిబ్రవరి 27: పాత పింఛన్ విధానం అమలు చేసిన రాజకీయ పార్టీలకు మాత్రమే తమ మద్దతు ఉంటుందని వారికి మాత్రమే తమ కుటుంబ సభ్యులు ఓట్లు వేస్తారని యూటీఎఫ్ మండల కార్యదర్శి పి.కన్నారావు చెప్పారు. కూనవరంలో మంగళవారం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామంటూ మేనిఫెస్టోలో పెట్టిన వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దానిని అమలు చేయలేకపోయిందన్నారు. దీనికిగాను పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి పోస్టుకార్డు ద్వారా రాజకీయ పార్టీ నాయకులకు తమ సందేశాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. దానిని ఆమోదించిన వారికే తమ ఓట్లు వేస్తామన్నారు. సమావేశంలో ఎ.నాగేశ్వరరావు, టి.సుబ్బారావు, శాంతామహతి, నాగదుర్గ, కుమారి, గౌతమి, లక్ష్మి, సత్యవతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజులుబాబు పండుగ



సహపంక్తి భోజనాలు చేస్తున్న దృశ్యం

వై.రామవరం, ఫిబ్రవరి 27: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో మంగళవారం అడవి రాజులుబాబు పండుగలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కణతలబంధ, దబ్బమామిడి, చామగడ్డ, దాలిపాడు, చవిటిదిబ్బలు తదితర గ్రామాల్లో ఈ పండుగలు నిర్వహించారు. ప్రతీ ఏటా మహాశివరాత్రికి నెలరోజుల ముందు నుంచి ప్రతీ ఆది, శుక్ర, మంగళవారాల్లో మాత్రమే ఈ పండుగలు నిర్వహిస్తారు. మామిడి, జీడిమామిడి చెట్ల కింద మాంసపు వంటకాలతో అడవిరాజుల బాబు పండుగ జరుపుతారు. అటవీ ప్రాంతాల్లో జీవనయానం సాగించే తమకు ఎటువంటి ఆపదలు ఎదురుకాకుండా చూడాలంటూ రాజులుబాబు పండుగలు జరుపుకోవడం ఏజెన్సీ ప్రాంతాల్లో ఆనవాయితీగా వస్తోంది.

అంగన్వాడీలపై వేధింపులు మానుకోవాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లపై ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాజమహేంద్రవరం ఐసీడీఎస్‌లో పనిచేసే సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకుని తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారని, దీన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఇదే సమయంలో అంగన్వాడీలు 42 రోజులపాటు తమ సమస్యలు పరిష్కరించాలని పోరాటం చేస్తే కొంతమంది సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు సమ్మె విచ్ఛిన్నానికి ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. సమ్మె విరమణ తర్వాత కూడా అంగన్వాడీ సెంటర్ల తనిఖీ పేరుతో వేధింపులు, కక్షసాధింపులకు పాల్పడుతున్నారని, షోకాజ్ నోటీసులు కూడా ఇస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఇటువంటి చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా వేధింపులు మానుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పోలీసులకు సహకరించాలి: సీఐ

కడియం, ఫిబ్రవరి 27: గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు పోలీసుశాఖకు సహకరించాలని సీఐ బి.తులసీధర్ కోరారు. వేమగిరిలో సీఐ తులసీధర్, కడియపులంకలో ఎస్‌ఐ దుర్గాప్రసాద్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికి ఘర్షణలకు పోవద్దని, స్థానికంగా పరిష్కారం చేసుకోవాలని, యువత మాదకద్రవ్యాలకు జోలికి వెళ్లొద్దని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పోయి కేసుల్లో ఇరుక్కోవద్దని చెప్పారు. ప్రతీ గ్రామంలో శాంతికమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేడే టీడీపీ-జనసేన బహిరంగ సభ

» విజయవంతం చేయండి: మాజీ మంత్రి సుజాత

బిక్కవోలు, ఫిబ్రవరి 27: తాడేపల్లిగూడెం సమీపంలోని పత్తిపాడులో బుధవారం నిర్వహించే టీడీపీ, జనసేన పార్టీల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, నియోజకవర్గ పరిశీలకురాలు పీతల సుజాత పిలుపునిచ్చారు. బిక్కవోలులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన మండలంలోని టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు లక్ష్యానికి మించి కార్యకర్తలు, నేతలు హాజరు కావాలన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మన సభకు ప్రభుత్వం బస్సులు ఇవ్వడం లేదని, ప్రతిఒక్కరూ కార్లు, ద్విచక్రవాహనాల్లో సభకు రావాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, రేలంగి నాగేశ్వరరావు, పడాల వెంకటరామారెడ్డి, రావాడ నాగు, ఇందల వీరబాబు పాల్గొన్నారు.

అనపర్తి/రంగంపేట: అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలోను, రంగంపేట మండలం ముకుందవరంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టీడీపీ-జనసేన బహిరంగ సభకు జనసమీకరణపై పార్టీ శ్రేణులతో చర్చించారు. ప్రత్తిపాడులో జరిగే బహిరంగ సభకు అనపర్తి నియోజక వర్గం నుంచి ఇరు పార్టీల శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి సభను విజయవంతం చేయాలన్నారు. సమావేశాల్లో సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, బాసి, ఒగిరెడ్డి సత్తిరెడ్డి, ఉద్దండ్రావు శ్రీను పాల్గొన్నారు.



బిక్కవోలులో మాట్లాడుతున్న పీతల సుజాత

కోరుకొండ: తాడేపల్లిగూడెం పరిధిలోని ప్రత్తిపాడులో జరిగే జనసేన-టీడీపీ బహిరంగ సభకు రాజానగరం నియోజకవర్గం నుంచి రెండు పార్టీల నాయకలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలించేందుకు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అన్ని గ్రామాల్లో వాల్‌పోస్టర్లు అతికించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ విముక్తి ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అవినీతి, అరాచక, రాక్షస పాలనకు చరమగీతం పాడేవిధంగా సభను విజయవంతం చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రతి గ్రామం నుంచి రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు 300 కార్లు, 100 బస్సుల్లో వెళనున్నట్టు పేర్కొన్నారు. జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు.

ఓటింగ్ శాతం పెరగాలి

» ఓటర్లలో అవగాహన పెంచాలి : కలెక్టర్

» దివాన్‌చెరువు, లాలాచెరువు ప్రాంతాల్లో పర్యటన



పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న కలెక్టర్ మాధవీలత

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలని, అందుకోసం ప్రతిఒక్క ఓటుహక్కును వినియోగించుకునేలా ఓటర్లలో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత సూచించారు. మంగళవారం ఆమె దివాన్‌చెరువు, లాలాచెరువు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గత ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా తక్కువ ఓటింగ్‌శాతం నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. రాజానగరం నియోజకవర్గం పరిధిలోని దివాన్‌చెరువు, లాలాచెరువు ఎంపీఈఎస్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ 65శాతం కంటే తక్కువగా నమోదైందని, ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు పర్యటించినట్టు కలెక్టర్ చెప్పారు. ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేందుకు తగిన ప్రణాళికలు, కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. ఈవీఎంలపై అవగాహన కల్పించి, రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. లాలాచెరువు పరిధిలోని 142, 143, 144, 146, 147, దివాన్‌చెరువు పరిధిలోని 136, 137 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతంపై బూత్‌వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీవో, రాజానగరం ఆర్‌వో ఏ.చైత్రవర్షిణి, తహశీల్దార్ జి.కనకరాజు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

పవన్.. స్పందించాలి

» జగ్గంపేటలో నెహ్రూను ఎట్టి పరిస్థితిలో గెలవనివ్వం

» జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి పాటంశెట్టి

గోకవరం, ఫిబ్రవరి 27: టీడీపీ, జనసేన పార్టీల పొత్తు ధర్మాన్ని జగ్గంపేట నియోజకవర్గంలో పాటించబోమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. గోకవరం మండలం అచ్యుతాపురంలో సూర్యచంద్ర దంపతులు చేపట్టిన అంతిమ ఆమరణ నిరాహార దీక్ష మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గంలో టీడీపీకి జనసైనికులెవ్వరూ ఓట్లు వేయరన్నారు. తన వద్ద డబ్బులేని కారణంగా టిక్కెట్ నిరాకరించారని, అసంతృప్తితో దీక్ష చేస్తున్నప్పటికీ పొత్తు ధర్మాన్ని నేటి వరకు తప్పకుండా టీడీపీకి అనుకూలంగానే వ్యవహరించానన్నారు. తాము దీక్ష చేపట్టి నాలుగు రోజులు గడిచినా టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కనీసం పరామర్శించడానికి రాకపోవడం దారుణమన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జగ్గంపేట నుంచి పోటీ చేస్తే లక్ష ఓట్లు మెజార్టీతో గెలుపును బహుమతిగా ఇస్తానన్నారు. నెహ్రూను ఎట్టి పరిస్థితిలో గెలవనివ్వబోమని సూర్యచంద్ర ఉద్ఘాటించారు. తాను చేపట్టిన దీక్షకు పవన్‌కళ్యాణ్ స్పందించకపోతే దీక్షలోనే ప్రాణాలు విడుస్తానన్నారు. తనపై కొందరు ఎన్నారైలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారిచ్చిన ప్రతి పైసా పార్టీ అభ్యున్నతికే వెచ్చించానని, తన వద్ద లెక్క ఉందని చెప్పుకొచ్చారు.



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర

టీడీపీ-జనసేన అధికారంలోకి రావాలి : వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ-జనసేన అధికారంలోకి రావాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, సిటీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. రాజమహేంద్రవరం 48వ డివిజన్‌లో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డిమణి పర్యవేక్షణలో మంగళవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. జగన్ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అన్ని వ్యవస్థలు సర్వనాశనం చేశాడన్నారు. టీడీపీ-జనసేన కూటమి ద్వారానే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కానేటి ప్రభుదాస్, కానేటి కృపామణి, మరుకుర్తి రవియాదవ్, బుడ్డిగ రాధా, అల్లాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి యిన్నమూరి దీపు రాజీనామా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: వైసీపీ నాయకుడు, ఉమామార్కండేయేశ్వర దేవస్థానం చైర్మన్ యిన్నమూరి దీపు తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు లేఖ పంపించారు. గతంలో టీడీపీలో ఉన్న దీపు దానికి రాజీనామా చేసి ఎంపీ భరత్‌రామ్ సమక్షంలో వైసీపీలో చేరారు. వ్యక్తిగత కారణాలతో తన రాజీనామాను ఆమోదించాలని దీపు కోరారు. ఆయన తిరిగి సొంత గూటికి టీడీపీలోకి చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్టు తెలిసింది.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రాజమహేంద్రవరం, కల్చరల్ ఫిబ్రవరి 27: స్థానిక కోరుకొండ రోడ్డులో శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో వైసీపీ అడపా శ్రీహరి, సూరిబాబు, ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, దిగవల్లి పవన్‌కాంత్‌శర్మ, వంగపండు లక్ష్మీనారాయణ, బంక వెంకటరెడ్డి బ్రదర్స్ పాల్గొన్నారు.

రెండు నెలల కిందట అదృశ్యం.. గోదావరిలో శవమై తేలిన వ్యక్తి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రెండు నెలల కిందట అదృశ్యమైన వ్యక్తి గోదావరిలో శవమై తేలాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం పీఅండ్‌టీ కాలనీకి చెందిన ఐ.కృష్ణ(35) వస్త్ర దుకాణంలో పని చేస్తు న్నాడు. రోజూ మాదిరిగానే గత ఏడాది డిసెంబరు 15న ఉద్యోగానికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో 16న మధ్యాహ్నం భార్య సత్యవేణి ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ పేర్కొన్నారు.

అమూల్‌తో పాడిరైతులకు ప్రయోజనం
ఎంపీడీవో రాజ్‌మనోజ్

కడియం, ఫిబ్రవరి 27: ప్రభుత్వం నిర్వహించబోతున్న అమూల్ కేంద్రాలకు పాడిరైతులు పాలు పోయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మార్చి 1నుంచి మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, కడియపులంక, మాధవరాయుడుపాలెం గ్రామాల్లో పాలకేంద్రాలు ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈ కేంద్రాల్లో గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ జి.రవివర్మ, డీఆర్‌డీఏ రాజానగరం ఏరియా కోఆర్డినేటర్ వై.జనార్దనరావు, ఏపీఎం అప్పలకొండ, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ ఏవీఎస్ లక్ష్మి, పశువైద్యాధికారులు కృష్ణవేణి, జె.కిరణ్ పాల్గొన్నారు.

ఓపెన్ ల్యాబ్ డేకు మంచి స్పందన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం ఇన్స్టిట్యూట్ ఇన్నోవేటివ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ ల్యాబ్ డేకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను డిగ్రీ కళాశాలల ఆర్‌జేడీ చప్పిడి కృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వదేశీ విజ్ఞానం, వికసిత భారత అభివృద్ధి గురించి వివరించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన, నమూనాలను ఇతర పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు.

తూర్పుకాపులకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి: రుడా చైర్మన్ రౌతు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: తూర్పుకాపు సంఘీయులకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు హామీ ఇచ్చారు. అనపర్తి నియోజకవర్గానికి చెందిన తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం సభ్యులు మంగళవారం రుడా కార్యాలయంలో రౌతును కలిసి ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్న తూర్పుకాపు సంఘీయులకు మాత్రమే ఓబీసీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సంఘీయులకు ఓబీసీ ధృవీకరణ పత్రాలకు నోచుకోవడం లేదని విన్నవించారు. దీనిపై స్పందించిన రౌతు మాట్లాడుతూ ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు లేక ఎంతోమంది తూర్పుకాపులు విద్య, ఉద్యోగ రంగాల్లో నష్టపోతున్నారన్నారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కొంకుదురులో తూర్పుకాపు విద్యవిజ్ఞాన అభివృద్ధి సంఘం కళ్యాణ మండపం నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాజేష్, ఈశ్వర్, పోతు రాజు, కోన అర్జునుడు, ఎరువాడ శ్రీను, వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆహార భద్రత పాటించకపోతే చర్యలు'

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: ఆహార భద్రత నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని స్టేట్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అన్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.రుక్కయ్యతో కలిసి మంగళవారం రాజమహేంద్రవరంలో కొని రెస్టారెంట్లను తనిఖీ చేశారు. కిచెన్లు, ఫ్రిజ్‌లలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలు పరిశీలించారు. ఈ తనిఖీలలో సిఎస్‌టి నాగలక్ష్మి, ప్రభాకర్, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.



ఏపీ ఎన్జీవో కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27 : చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ఏపీ జేఏసీ నేతలకు నోటీసులు జారీ చేస్తూ పోలీసుశాఖ తీసుకున్న చర్యలకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరంలోని ఏపీ ఎన్జీఓ హోం వద్ద ఆందోళన నిర్వహించారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని, రెండు డీఏలు విడుదల చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు వైవీవీఎస్ నాయుడు, సేవా ప్రవీణ్‌కుమార్, సహాధ్యక్షులు పి.అనిల్‌కుమార్, ఏ.నాగ శ్రీనివాస్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేజీకే మూర్తి, మహిళా కన్వీనర్ హిమగౌరి, కోశాధికారి కె.శ్యామల, పి.నాగేశ్వరరావు, విఘ్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధికి కృషిచేయాలి
యువసంవాద్@2047లో 'నన్నయ' వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27: ప్రపంచంలోనే ఎక్కువ మంది యువత ఉన్న భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని, దేశాభివృద్ధిలో యువత కీలకపాత్రను పోషించాలని వీసీ కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువసంవాద్ ఎట్ 2047 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన పంచప్రాణ్ సూత్రాలను పాటిస్తే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, డీన్స్ ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య వి.సురేష్‌వర్మ, కన్వీనర్ ఎం.గోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవోలు తదితరులు పాల్గొన్నారు.

టెలికాం హక్కులపై అవగాహన సదస్సు

రాజానగరం, ఫిబ్రవరి 27: టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, అధికారాలపై తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐటీఎస్ ప్రాంతీయ కార్యాలయ సలహాదారు బి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించడంలో తమ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలన్నారు. పలు రాష్ట్రాల్లో ప్రాంతీయ కార్యాలయాల పాత్ర, విధులు, టెలికాం వినియోగదారుల రక్షణకు చేపడుతున్న చర్యలను వివరించారు. ట్రాయ్ నిబంధనలు, మొబైల్ నెంబర్ల పోర్టబులిటీ, అన్‌సోలిసిటెడ్ కమర్షియల్ కమ్యూనికేషన్స్, కంప్లైంట్ రిడ్రెసల్ మెకానిజం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే రేడియేషన్, డిజిటల్ మోసాలు, ఈఎంఎఫ్ రేడియేషన్, 5జీ టెక్నాలజీ, వినియోగ కేసులు, సైబర్ మోసాలను డాట్ డైరెక్టర్ జీవీ మనోజ్‌కుమార్ వివరించారు. సీనియర్ సైబర్ నిపుణులు, రాజమండ్రి సైబర్ సెల్ వైఎస్‌వీ సురేష్ డిజిటల్ మోసాలు, భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఎస్ కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ ఎం.వెంకటపతి, కార్యక్రమ ఇన్‌చార్జ్ ఎం.నరసింహారావు, సిబ్బంది, టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల, వినియోగదారుల ఫోరంల ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లిబాబు ఆర్థిక సాయం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27: ఇటీవల మృతిచెందిన పల్లకడియం టీడీపీ నాయకుడు గుత్తుల ఆదినారాయణ కుమార్తెల చదువు నిమిత్తం దివాన్‌చెరువుకు చెందిన రాష్ట్ర టీడీపీ సాధికారసమితి గౌడ డైరెక్టర్ వంక మల్లికార్జునస్వామి(మల్లిబాబు) రూ.25 వేలు చెక్కును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరికి మంగళవారం అందజేశారు. ఈ విషయాన్ని మంగళవారం మల్లిబాబు విలేకరులకు తెలిపారు. తన తండ్రి దివంగత వంక సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఈ ఆర్థిక సాయం అందజేసినట్టు చెప్పారు.

వడిశలేరు సర్పంచ్ ఎన్నికపై పిటిషన్ కొట్టివేత

రంగంపేట, ఫిబ్రవరి 27: మండలంలోని వడిశలేరులో 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికైన కొల్లాటి శ్యామలావతి ఎన్నిక చెల్లదంటూ శ్యామలావతిపై పోటీ చేసి ఓటమి చెందిన పోతుల ఉషారాణి వేసిన పిటిషన్‌ను పెద్దాపురం మున్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొట్టివేశారని న్యాయవాది దుర్గారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1995లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీ మహిళ అభ్యర్థి గాను, 2021లో జరిగిన ఎన్నికల్లో ఎస్సీ మహిళ అభ్యర్థిగా పోటీడాన్ని వ్యతిరేకిస్తూ పోతుల ఉషారాణి వేసిన దాఖలు పిటిషన్‌ను కొన్ని సాంకేతిక కారణాలు చూపుతూ కొట్టి వేసినట్టు చెప్పారు.

జీజీయూ ఆవిర్భావ వేడుకలు

రాజానగరం, ఫిబ్రవరి 27: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించడం, వారిని అభివృద్ధి పథంలో పయనింపచేయడమే గైట్ గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)ప్రధాన ఉద్దేశ్యమని గైట్ గ్లోబల్ యూనివర్శిటీ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు), ప్రోఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ అన్నారు. గైట్ కళాశాల జీజీయూ ఆవిర్భావ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్యరాజు మాట్లాడుతూ గైట్ కళాశాల చరిత్రలో నూతన శకం ప్రారంభమైందని, అధ్యాపకులు నిరంతరం తమ విజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, ప్రిన్సిపాల్స్ పీఎంఎంఎస్ శర్మ, ఎంవీఎస్ బాబు, ఎండీ ధనరాజు, పీజీ రామానుజం, కె.వల్లీమాధవి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

గైట్ ఎన్ఎస్ఎస్ పీవోకు వలంటీర్ హీరో అవార్డు

సామాజిక సేవా పురస్కారాలు 2022-23 సంబంధించి గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ మీరాకు వాలంటీర్ హీరో అవార్డు లభించింది. ఈమేరకు ఫిబ్రవరి 24న ముంబైలోని ఓహోటల్‌లో బాలీవుడ్ నటి శ్రియా పిల్గావ్కర్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.. అలాగే వలంటీర్లు పి.సుచిత్ర, జి.సాయి శశాంక్, కె.లక్ష్మీ లాలిత్యలకు యూత్ చాంపియన్ అవార్డును ప్రభాత్‌పాణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ సస్టెయి నబుల్ డెవలప్‌మెంట్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు గ్రహీతలను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, యాజమాన్యం అభినందించింది.

పీఎంపీలకు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం, కల్చరల్, ఫిబ్రవరి 27: గ్రామాల్లో ప్రాథమికంగా వైద్య సేవలందించే పీఎంపీలు వ్యాధులను గుర్తించడంలో అవగాహన మేలు చేస్తుందని ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ బలభద్ర వెంకటరాజు అన్నారు. మంగళవారం కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు హుకుంపేట సమీపంలోని గోదావరి రుచులు కాన్ఫరెన్స్‌లో అబ్దుల్ రహమాన్ అధ్యక్షతన జరిగింది. సదస్సులో వెంకటరాజు మాట్లాడుతూ మెదడు సంబంధిత వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే చికిత్స అందించడం సులభమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, పి.దేవానందన, మట్టా రమేష్, యు.ప్రసాద్, ఎ.సురేష్‌బాబు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఊరుపేరు భైరవకోన
సూర్యామినీ	: ముఖ్యగమనిక, క్రాక్
సూర్యాప్యాలస్	: భ్రమయుగం
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: ఊరుపేరు భైరవకోన
అశోక	: ------
ఊర్వశి	: సిద్ధార్థ్‌రాయ్
రంభ	: యాత్ర-2, రాజధాని ఫైల్స్
మేనక	: మస్త్ షేడ్స్ ఉన్నాయిరా, లాల్‌సలామ్
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: సుందరం మాస్టర్
వీఎస్ మహాల్(నామవరం)	: ఊరుపేరు భైరవకోన
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: భ్రమయుగం
వెంకటసూర్య(కడియం)	: సిద్ధార్థ్‌రాయ్
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్ట్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఊరుపేరు భైరవకోన
రామకృష్ణ(కోరుకొండ)	: ఊరుపేరు భైరవకోన
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఊరుపేరు భైరవకోన
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహాల్(రంపచోడవరం)	: ఊరుపేరు భైరవకోన
నవయుగ(చింతూరు)	: సిద్ధార్థ్‌రాయ్

సూపరింటెండెంట్‌కు ఏవోగా పదోన్నతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 27 : రాజమహేంద్రవరంలోని మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేవీవీ సురేష్‌బాబుకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు గొల్లపూడిలోని డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సురేష్‌బాబును కృష్ణా జిల్లా మచిలీపట్నం డీఎంహెచ్‌వో కార్యాలయం ఏవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడే టీడీపీ-జనసేన బహిరంగ సభ

తాడేపల్లిగూడెంలో ఏర్పాట్లు 8



కాయ్ రాజా కాయ్

- ఎవరి 'లెక్క' వారిది
- వేడెక్కుతున్న రాజకీయం
- జిల్లాలో బెట్టింగ్‌ల జోరు
- నిన్నటి వరకూ అభ్యర్థి ఎవరని?
- నేడు గెలుపు ఎవరిదని?
- మిగిలిన సీట్లపై పందేలు
- చేతులు మారుతున్న రూ.కోట్లు

అటు సీట్ల వేట.. ఇటు నోట్లతో బెట్టింగ్ ఆట

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నోటిఫికేషన్ దారిలో ఉంది. ఏ క్షణంలోనైనా ఉరుముతుంది. దీంతో అభ్యర్థులు, ఆశావహులు 'లెక్క'లు వేసుకోవడంతో పాటు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ప్రావీణ్యానికి పదును పెడుతున్నారు. సీటు నాదని ఒకరు.. బరిలో నేనే అని మరొకరు.. మా పార్టీదే అధికార పీఠమని ఇంకొకరు. ఇలా దూసుకుపోతుండగా.. ప్రజల్లో కూడా చర్చ జోరందుకుంది. ఇది ఓటుకు ఓ వైపు.. మరోవైపు 'కాసులు' కాలు దువ్వడం మొదలైపోయింది. నగదు, నగలు, వాహనాలు, ఆస్తులు.. ఇలా బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. రాష్ట్రమంతా ఓ ఎత్తు అయితే ముందు నుంచీ తూర్పుగోదావరి జిల్లా తీరు 'సెపరేటు'గా నడుస్తోంది. దీంతో పందేలూ పరుగులు పెడుతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంలోనూ తూర్పులో తీవ్ర ఉత్కంఠ నడుస్తూనే ఉంది. అది బెట్టింగ్‌లకు ఊతమిచ్చింది. నిన్నమొన్నటి వరకూ అభ్యర్థి ఎవరు? ఇన్‌చార్జిగా ఎవరిని నియమిస్తారు? వారికే సీటు దక్కుతుందా? అనే అంశాలను బెట్టింగ్‌లకు ప్రమాణాలుగా తీసుకున్నారు. ఇప్పుడు టీడీపీ తమ అభ్యర్థులను ప్రకటించడంతో క్రీడ రసవత్తరంగా మారింది. ఇప్పటికే అభ్యర్థిత్వాలపై సాగుతున్న బెట్టింగ్‌లు గెలుపుపైకి మారింది. టీడీపీ ప్రకటించిన జాబితాలో జిల్లాలోని కీలక స్థానమైన రాజమహేంద్రవరం సిటీకి టీడీపీ అభ్యర్థిని ప్రకటించడం, ఇప్పటికే వైసీపీ నుంచి భరత్‌రామ్ బరిలో ఉండడంతో బెట్టింగ్‌లు కోట్లకు చేరి దూసుకుపోతున్నాయి. గెలుపు మాదేనంటే మాదేనంటూ పందేలు కాస్తున్నారు. ఎవరి 'లెక్క'లు వాళ్లేసుకుని బెట్టింగ్ కడుతున్నారు. టీడీపీ సైకిల్ జోరు మీదుండడం, జనసేనతో సాఫీగా పయనం సాగుతుండడం.. రెండూ కలిసి కచ్చితంగా అధికారంలోకి వస్తాయని బలంగా వినిపిస్తుండడంతో ఇప్పటి వరకూ టీడీపీ అభ్యర్థులపై ఆసక్తి బాగా ఎక్కువైంది.కొందరు టీడీపీ, జనసేన అభ్యర్థుల ప్రకటనతో పార్టీలతో సంబంధం లేని ప్రజానీకం కూడా పందేల్లో ఎంతో కొంత వాటా పెడుతున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని గోదావరికి పశ్చిమంవైపు ఉన్న ఓ నియోజకవర్గంలో సీటుపై బెట్టింగ్‌లు లక్షల్లో జరుగుతున్నాయి.ఈ నియోజకవర్గానికి టీడీపీ -జనసేన, వైసీపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించకపోవడం గమనార్హం. టీడీపీ శనివారం అభ్యర్థులను ప్రకటించడంతో మిగిలిన 4 నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎవరనే విష యంపై తీవ్రంగా చర్చ సాగింది. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం రూరల్ సీటుపై ఇంకా డైలమా కొనసాగుతూనే ఉంది. ఇరుపార్టీల అధినేతలు ఇరువురు అభ్యర్థులకు సీటు మీదేనంటూ హామీ ఇవ్వడంతో ఈ సీటుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే శనివారం ఈ సీటుపై కూడా స్పష్టమైన హామీ వచ్చినట్టు తెలిసినా ఇంకా రకరకాల ప్రచారం సాగుతూనే ఉంది. దీంతో మరింత ఉత్కంఠ నెలకొంది. దీంతో ఇంకా బెట్టింగ్ సాగుతూనే ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ సీటు వ్యవహారం నిడదవోలును తాకడంతో అక్కడా ఇదే పరిస్థితి. వైసీపీలో నియోజకవర్గ ఇన్‌చార్జిలపై మరో విధంగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. వైసీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ఇప్పటి వరకూ ఇన్‌చార్జిలుగా నియమించిన వారికి సీటు ఉంటుందా లేదా అనే దానిపై బెట్టింగ్‌లు జోరుగు సాగుతున్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో టిక్కెట్లు ఎవరికి వస్తాయనే దానిపై కూడా బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. బెట్టింగ్ వ్యవహారమంతా స్మార్ట్ ఫోన్లలోనే నడిచిపోతోందని చెబుతున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నివేదిక ఇవ్వండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక , హేతుబద్ధీకరణ పోలింగ్ కేంద్రాలను గుర్తించడంలో రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలో ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్ , సహాయ రిటర్నింగ్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతో పోలింగ్ కేంద్రాలు, ఫారం 6 ,7,8 పరిష్కార స్థాయి అంశాలపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. 1500 పైబడి ఓటర్లు, ఓటర్ల నివాస ప్రాంతాల నుంచి దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు తగిన కారణాలు తెలియచేస్తూ ప్రతిపాదనలు పంపాలన్నారు. రాజానగరం నియోజకవర్గంలో 216 పోలింగ్ కేంద్రాలకు 60 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామన్నారు. ఇప్పటి వరకు అనపర్తి నియోజకవర్గం 228 పోలింగ్ కేంద్రాల్లో 67 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారని, రాజమహేంద్రవరంలో 232 పోలింగ్ కేంద్రాలకు 49 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించడం జరిగిందన్నారు. రూరల్‌లో 264 పోలింగ్ కేంద్రాలకు 22 సమస్యాత్మక , కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాల్లో 35 సమస్యాత్మక, నిడదవోలులో 205 పోలింగ్ కేంద్రాల్లో 41 సమస్యాత్మక , గోపాలపురంలో 248 పోలింగ్ కేంద్రాల్లో 62 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నా రు. మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేయాని స్పష్టం చేశారు. డీఆర్వో జి.నరసింహులు, పార్లమెంట్ ఆర్వో ఆర్.కృష్ణనాయక్, డిటీ సునీల్, కమిషనర్ దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

నిడదవోలు సీటుపై ఉత్కంఠ

- ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై కసరత్తు
- సీటు తనకే కేటాయించారన్న దుర్గేష్
- శేషారావుకే ఇవ్వాలని టీడీపీ పట్టు
- ఇంకనూ కేటాయించని వైసీపీ సీటు

నిడదవోలు, ఫిబ్రవరి 27 : ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు..రాజమహేంద్రవరం రూరల్ సీటుపై ఉత్కంఠ ఇప్పుడు నిడదవోలు నియోజకవర్గంపై పడింది.. నిన్న మొన్నటి వరకూ రాజమహేంద్రవరం రూరల్ సీటు నాదంటే నాదంటూ అటు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి.. ఇటు తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీపడ్డారు. శనివారం ప్రకటించిన టీడీపీ-జనసేన ఉమ్మడి జాబితాలో ఇరువురు తమ పేర్లు ఉంటాయని ఆశించారు. అయితే అధిష్ఠానం మాత్రం షాకిచ్చింది..ఇటు రాజమహేంద్రవరం రూరల్ అటు నిడదవోలుకు జాబితాలో చోటివ్వలేదు. ఇదిలా ఉండగా అధినేతలు ప్రకటించకపోయినా రాజమహేంద్రవరం రూరల్ నుంచి గోరంట్ల బుచ్చయ్యచౌదరికే సీటు ఇచ్చారని.. నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ పోటీ చేస్తారనే వార్త హల్‌చల్ చేసింది. దీనికి తగినట్టు కందుల దుర్గేష్ కూడా సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో రిలీజ్ చేశారు. దీంతో నిడదవోలు టీడీపీలో ఒక్కసారిగా ప్రకంపనలు తెచ్చింది. దీంతో ప్రస్తుతం పొలిటికల్ హీట్ నిడదవోలు నియోజకవర్గాన్ని తాకింది. నిడదవోలు నియోజకవర్గం అవిర్భవించిన తరువాత 2009,2014 ఎన్నికల్లో టీడీపీ తరపున బూరుగుపల్లి శేషారావు విజయఢంకా మోగించారు. 2019 ఎన్నికల్లో స్వంత పార్టీలోనే అంతర్గత పోరు కారణంగా శేషారావు ఓటమిపాలు కాగా వైసీపీ అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు విజయ సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం



నిడదవోలులోని గణేష్‌చౌక్

సాధించే దిశగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పార్టీ కార్యక్రమాలతో ప్రజల్లోకి దూసుకుపోయారు. మరో పక్క తెలుగుదేశం పార్టీకి చెందిన మరో నాయకుడు కుందుల సత్యనారాయణ తన సొంత వర్గంతో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ఒకానొకదశలో కుందుల సత్యనారాయణ ఎమ్మెల్యే సీటు తనకే వచ్చిందంటూ దేవాలయాల వద్ద కొబ్బరికాయలు కొట్టి హడావుడి చేశారుఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో తాజాగా నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఉమ్మడి అభ్యర్థిగా కందుల దుర్గేష్ పోటీ చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచించినట్టు కందుల దుర్గేష్ మీడియాతో పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు ముక్తకంఠంతో ఎమ్మెల్యే అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు అయితేనే ఫ్యాన్ స్పీడ్‌కు చెక్ పెట్టవచ్చని మరొక అభ్యర్థి అయితే కష్టం అనేది తెలుగుదేశం పార్టీ శ్రేణుల మాట. టీడీపీ కంచుకోట మరో పక్క కాపు సామాజికవర్గం ఓట్లు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో వైకాపా కాపు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడికి చెక్ పెట్టేందుకు తెలుగుదేశం అధిష్ఠానం కూడా కందుల దుర్గేష్ వైపు మొగ్గు చూపినట్టు సమాచారం. నిన్నటి వరకూ రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గంలో నెలకొన్న ఉత్కంఠ ప్రస్తుతం నిడదవోలులో కొనసాగుతోంది.వైసీపీ టిక్కెట్‌పై ఇప్పటికీ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.ఇప్పటికి అభ్యర్థి ఎవరనేది తేలకపోవడం గమనార్హం.



అనపర్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట కొప్పవరం రోడ్డులో బైఠాయించి డమ్మీ పట్టాల ప్రతులతో నిరసన తెలుపుతున్న రామకృష్ణారెడ్డి, పార్టీ శ్రేణులు

దుర్గేష్‌కు రాజమహేంద్రవరం రూరల్ సీటివ్వాలి



కడియం నుంచి ర్యాలీగా రాజమహేంద్రవరం బయలుదేరిన జనసేన నాయకులు, కార్యకర్తలు

కడియం, ఫిబ్రవరి 27: జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల లక్ష్మీదుర్గేష్‌కే రాజమహేంద్రవరం రూరల్ సీటును కేటాయించాలని జనసైనికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కడియం దేవిచౌక్ సెంటర్ నుంచి రాజమహేంద్రవరం డీలక్స్ సెంటర్ వరకు భారీ పాదయాత్ర చేశారు. మంగళవారం ఉదయం కడియం మండలంలో అన్ని గ్రామాల నుంచి జనసైనికులు,నాయకులు తరలివచ్చి పాదయాత్ర చేశారు.పాదయాత్ర కడియం దేవి చౌక్ నుంచి ప్రారంభమై వేమగిరి, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం కోటిపల్లిబస్టాండ్ మీదుగా డీలక్స్ సెంటర్‌కు చేరుకుంది. సుమారు 15 కిలోమీటర్ల మేర 200 మంది వరకూ పాదయాత్ర చేశారు. రాజమహేంద్రవరం రూరల్ సీటు జనసేన టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా దుర్గేష్‌కు కేటాయిస్తే అఖండ విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ముద్రగడ జమీ, గట్టి నర్సయ్య పంతం గణపతి, గెడ్డం శివ, చెరుకూరి రామారావు, పాటంశెట్టి రవి, పుల్లా రామారావు, చెక్కపల్లి మురళీకృష్ణ, మల్లు శివ, ఆదిమూలం సాయిబాబా, పాటంశెట్టి రాంజీ, ఇనుమర్తి ప్రభాత్, తోరాటి శ్రీను, దర్శనం శివ, గొల్లపల్లి శ్రీను, నాగిరెడ్డి రామకృష్ణ, జంగా వినోద్, కొప్పిశెట్టి రాజేష్, పుల్లా రామన్న, కర్రి ఎస్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సొమ్ములివ్వకుండా.. పట్టాలెలా ఇస్తారు..

- డమ్మీ పట్టాల తయారీపై విచారణ నిర్వహించి బాధ్యులను శిక్షించాలి
- అనపర్తిలో డమ్మీ పట్టాల ప్రతులను దహనం చేసి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి నిరసన

అనపర్తి, ఫిబ్రవరి 27 : అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో డమ్మీ పట్టాలు తయారు చేస్తున్న అధికారులు.. దీని వెనుక ఉన్న సూత్రధారులపై విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అనపర్తి దేవీచౌక్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం భారీ ర్యాలీ చేశారు.భూసేకరణకు ప్రపోజల్స్ పంపి రైతులకు సొమ్ములు చెల్లించకుండానే అదే సర్వే నెంబర్లతో పట్టాలు తయారు చేయడంపై మండిపడ్డారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద పట్టాల డమ్మీ నకళ్ళను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతరం డమ్మీ పట్టాల తయారీపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు నకళ్ళను అనపర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారినికి అందజేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఏడాదిన్నర కిందట సేకరించిన భూమికి నేటికీ రైతులకు సొమ్ములు చెల్లించకుండా అవే సర్వే నెంబర్లతో ప్లాట్ నెంబర్లు, సరిహద్దులతో తయారు చేసిన పట్టాలు డమ్మీ కాకుండా మరేమవుతాయని ప్రశ్నించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, గొలుగూరి రామభాస్కరరెడ్డి, మామిడిశెట్టి శ్రీను,నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, తమలంపూడి సత్తిరెడ్డి, పేరిశెట్టి లాలయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సహా 30మందిపై కేసు

అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో డమ్మీ పట్టాలు తయారవుతున్నాయని శనివారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయంలోకి ప్రవేశించి అధికారుల విధులకు భంగం కలిగించారని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామరావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి సహా 30 మందిపై వీఆర్‌వో రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు.ఇప్పటికే 37 అక్రమ కేసులు పెట్టారని దీంతో 38కు చేరాయన్నారు.

అనపర్తి డీటీ శశిధర్ రంగంపేటకు బదిలీ

అనపర్తి, ఫిబ్రవరి 27 : అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న టి.శశిధర్‌ను రంగంపేట తహశీల్దార్ కార్యాలయ డీటీగా బదిలీ చేశారు. రంగంపేట తహశీల్దార్ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న దొరకయ్యను అనపర్తి డీటీగా బదిలీ చేసినట్టు సమాచారం. గత రెండు రోజులు కిందట అనపర్తి తహశీల్దార్ కార్యాలయంలో కలకలం రేపిన డమ్మీ పట్టాల తయారీ కారణంగా ఈ బదిలీలు జరిగినట్టు తెలుస్తుంది.

మార్చి 1న ఎమ్మెల్యే ఇంటికెళ్లి
అవినీతిపై చర్చిస్తా
టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గత ఐదేళ్ల కాలంలో చేసిన 500 కోట్ల అవినీతిపై బహిరంగంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. తేదీ సమయం చెప్పి రావాలని ఎమ్మెల్యే కోరిక మేరకు మార్చి 1వ తేదీ ఉదయం 11 గంటలకు చర్చకు ఎమ్మెల్యే నివాసానికి వెళతానన్నారు. ఎమ్మెల్యే చేసిన అవినీతిపై ఆధారాలతో సహా వస్తానని ఎక్కడ అవినీతికి పాల్పడిందీ ముందుగానే ఎమ్మెల్యేకు తెలిజేసి చర్చకు వస్తానన్నారు. తాను చర్చించే అంశాల వివరాలను ముందుగానే వెల్లడించడానికి సిద్ధంగా ఉన్నానని..ఎమ్మెల్యే ఎవరిని పంపినా వివరాలు అందిస్తానన్నారు. చర్చకు సిద్ధమంటూ ప్రగల్బాలు పలికిన నాయకుడు విషయాన్ని అప్పుడే రాష్ట్ర పోలీసు ఉన్నాతాధికారులకు, జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు వివరించి పోలీసు బందోబస్తు కోరుతున్నారని తనకు బందోబస్తు అవసరంలేదని అవినీతిని నిరూపించేందుకు ధైర్యంగా వస్తానని రామకృష్ణారెడ్డి అన్నారు. అధికార పక్షం, ప్రతిపక్షం సవాళ్లతో మార్చి 1న అనపర్తిలో ఏం జరగబోతుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మీ పిల్లలైతే ఇలాగే వదిలేస్తారా?

- గోకవరం గురుకులంలో విద్యార్థినికి అనారోగ్యం.. ప్లేట్‌లెట్స్ పడిపోయి నీరసం
- తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం.. ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు



ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

గోకవరం, ఫిబ్రవరి 27 : ఉన్నత చదువుల కోసం స్వగ్రామాలకు దూరంగా, తల్లిదండ్రులను విడిచి గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల కొంతమంది ప్రభుత్వ అధ్యాపకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సొంత పిల్లల్లా సాకాల్సిన వారే వారిపట్ల చిన్నచూపు చూస్తూ పాపాన్ని మూటగట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ అధ్యాపకులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. దీనివల్ల విద్యార్థులు కనీస సౌకర్యాలకు నోచుకోకుండా, అనారోగ్యాలతో కొట్టుమిట్టాడుతున్నారు. గోకవరం మండలం వీరలంకపల్లి గ్రామంలో గల బీఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సుమారు 500 మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడి విద్యార్థినుల పట్ల కళాశాల నిర్వహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనే అపవాదు ఉంది. కొంత కాలం కిందట భోజనం వికటించి పలువురు విద్యార్థినులు ఆసుపత్రి పాలైన సంగతి తెలిసిందే. తాజాగా అదే కళాశాలలో 6వ తరగతి విద్యార్థిని వీరలంకపల్లి గ్రామానికి చెందిన సుంకర భాను అనారోగ్యానికి గురైంది. కళాశాల నిర్వాహకులు సుమారు 10 రోజుల నుంచి గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కానీ భాను ఆరోగ్య పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు మంగళవారం కళాశాల వద్దకు వెళ్లి అధ్యాపకులను నిలదీశారు. ఆ వెంటనే తమ కుమార్తెను తీసుకొని ప్రభుత్వాసుత్రికి వెళ్లారు. అసలు విషయం ఏమిటని వైద్యులను ప్రశ్నించగా రక్తకణాల సంఖ్య తక్కువగా ఉందని చెప్పడంతో విద్యార్థిని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొంతమంది గ్రామ పెద్దలతో కలిసి తల్లిదండ్రులు కళాశాల వద్దకు వెళ్లి నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. విద్యార్థినుల పట్ల ఇంత కఠినంగా వ్యవహరిస్తారా అంటూ మండిపడ్డారు. మీ పిల్లలైతే ఇలాగే వదిలేస్తారా, రోజుల తరబడి రోగం తగ్గకపోయినా ఇంట్లోనే ఉంచుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధ్యాపకుల నుంచి నిర్లక్ష్యపు సమాధా నమే వచ్చింది. దీంతో తల్లిదండ్రులు మరింత రెచ్చిపోయారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ వ్యవహారశైలి కారణంగానే కళాశాలలో ఇటువంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలంటూ కొంతసేపు కళాశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. అనంతరం అనారోగ్యానికి గురైన విద్యార్థిని భానును మెరుగైన వైద్యం నిమిత్తం తల్లి దండ్రులు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వీరలంకపల్లిలో ఉన్న అంబేద్కర్ గురుకుల కళాశాల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీంతో కళాశాలల్లో విద్యార్థి నుల పట్ల అధ్యాపకులు ఏమాత్రం శ్రద్ధ వహించరనే ఆరోపణలు ఉన్నాయి.

నిడదవోలుకు నెల రోజుల్లో
ముగ్గురు కమిషనర్లు

- కోన శ్రీనివాస్ ఏరి కోరి వచ్చినా .. నెలలోనే బదిలీ
- పదోన్నతిపై కొవ్వూరు కమిషనర్ శ్రీకాంత్ బాపట్లకు?



శ్రీకాంత్



కోన శ్రీనివాస్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి, 27 (ఆంధ్రజ్యోతి)/నిడదవోలు/కొవ్వూరు : మునిసిపల్ కమిషనర్ల బదిలీల్లో రాజకీయం ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి. జిల్లాలో రెండు మునిసిపాలిటీలు, ఒక కార్పొరేషన్ ఉంది. అయితే నెల రోజుల్లో నిడదవోలు మునిసిపాలిటీ మూడో కమిషనర్ వస్తున్నారు. జనవరి 26న అంటే ఇవాల్టికి సుమారు నెల రోజుల కిందట మునిసిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. అప్పుడు నిడదవోలు కమిషనర్‌గా పిఠాపురం కమిషనర్ కృష్ణవేణిని బదిలీ చేశారు. కానీ ఆమెను నిడదవోలు వైసీపీ నేతలు జాయిన్‌కాకుండా అడ్డుకున్నారనే సమాచారం ఉంది. ఆమె విధుల్లో చేరడానికి విఫల యత్నం చేశారు. కానీ అక్కడి వైసీపీ నేత రికమండేషన్‌తో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీలో పనిచేస్తున్న కోన శ్రీనివాస్ ఇక్కడ కమిషనర్‌గా చేరారు. ఇంకా నెల రోజులు కూడా పూర్తి కాలేదు. ఎందు వల్లనో ఒక్క నెలలోనే ఆయనను బదిలీ చేశారు. మంగళవారం ప్రభుత్వం జారీ చేసిన జీవోలో ఆయనను డిప్యుటేషన్ మీద పార్వతీపురం కమిషనర్‌గా నియమించారు.ఇక్కడకు రేపల్లె కమిషనర్ టి.రాంభూల్ రెడ్డిని బదిలీ చేశారు. కొవ్వూరు కమిషనర్ బి.శ్రీకాంత్ . గ్రూప్ -1 ఆఫీసర్‌గా సుమారు ఏడాదిన్నర కిందట ఇక్కడకు వచ్చారు. ఇక్కడ వివాదాలు లేకుండా పనిచేస్తున్నారనే పేరు తెచ్చుకున్నారు. కానీ ఆయన ను కూడా బాపట్లకు బదిలీ చేశారు. కొవ్వూరు మునిసిపాలిటీ ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. శ్రీకాంత్ కొద్ది నెలల కిందట గ్రేడ్- కమిషనర్‌గా పదోన్నతి పొందారు.ఈ మేరకు బదిలీ చేశారా, లేక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ నేతలకు ఇష్టంగా పనిచేసే వారినెవరినైనా తేనున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఫిబ్రవరి 27: పోలియో రహిత పట్టణంగా కొవ్వూరును తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన పల్స్‌పోలియో టాస్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్చి 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు 100శాతం వేయించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు టి.సుష్మ, ఎలక్ట్రికల్ ఏఈ డి.జగదీశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు తరలిన బీజేపీ నాయకులు

కొవ్వూరు, ఫిబ్రవరి 27: ఏలూరులో జరిగే బీజేపీ బహిరంగ సభకు కొవ్వూరు నుంచి ఆ పార్టీ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ ఏలూరు బహిరంగ సభ నుంచి బీజేపీ ఎన్నికల శంఖారవం పూరించబోతుందన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే రాష్ట్రాభివృద్ధి ప్రశ్నార్థకంగా మారబోతుందని, అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, ఎం.వీరాంజనేయులు, ఎం.రామచంద్రరావు, కొండపల్లి రత్నసాయి తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల ఆర్థిక సాయం

గోపాలపురం, ఫిబ్రవరి 27: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన గంగులకుర్తి రమేష్ రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న నాయీబ్రాహ్మణుల సంఘం రమేష్ కుటుంబానికి మంగళవారం ఆర్థిక సాయం అందజేసింది. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకుడు జగతా రామకృష్ణ, మండలాధ్యక్షుడు అయ్యంకి రవి, తురాయి సత్యనారాయణ, అయ్యంకి వెంకటరమణ, జగతా మణికంఠ, గంగరాజు, సోమరాజు పాల్గొన్నారు.

నేడు, రేపు నిరవధిక దీక్షలు

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు దొరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మద్దుకూరి దొరయ్య

కొవ్వూరు, ఫిబ్రవరి 27: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలుచేయాలని కోరుతూ ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు మద్దుకూరి దొరయ్య అన్నారు. మంగళవారం ఆయన కొవ్వూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరబాబు మాట్లాడుతూ నిర్మాణరంగ కార్మికులకు సంక్షేమ పథకాలను బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేయాలని, 1214 మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షల్లో అధికార, ప్రతిపక్ష, రాజకీయ పార్టీల ఆశావహులు పాల్గొని తమ పార్టీల వైఖరి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రేఖ నాగేశ్వరరావు, ర్యాలి బ్రహ్మానందం, జొన్నల రాంబాబు, మాణికిరెడ్డి హరిబాబు, వీరా త్రిమూర్తులు, కొమ్మన రాముడు పాల్గొన్నారు.

అర్చక, పురోహితుల ఆత్మీయ సమావేశం

చాగల్లు, ఫిబ్రవరి 27: హిందూ ధర్మ పరిరక్షణ, భావితరాలకు అందించే బాధ్యత నిర్వహించడంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, పురోహితులు కృషి గొప్పదని విశ్వహిందు పరిషత్ నాయకుడు డి.ప్రభాకరశర్మ అన్నారు. మంగళవారం స్థానిక పాటెమ్మ తల్లి కల్యాణ మండపంలో జరిగిన ఆలయ ధర్మకర్తల, అర్చక, పురోహితుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురోహితుల సమస్యలు పరిష్కారానికి ఐకమత్యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లింగాల శ్రీనివాసశర్మ, రంగబాబు, వి.శాస్త్రి పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు శంకుస్థాపన

దేవరపల్లి, ఫిబ్రవరి 27: దేవరపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో రూ.7లక్షల వ్యయంతో నిర్మించే మంచినీటి బోరును సర్పంచ్ కడిమి వీరకుమారి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రమైన దేవరపల్లిలో రోజురోజుకి జనాభా పెరుగుతుందని ప్రజల అవసరార్థం మంచినీరు అందించాల్సిన బాధ్యత ఉందని, బోరునిర్మాణం పూర్తయితే తాగునీటి సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో వెలగా సాంబశివరావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పచ్చా రామ్‌గోపాల్, కడిమి రాజు, మాదవరపు వెంకటేశ్వరరావు, సూర్యారావు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభపెడితే చర్యలు తప్పవు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన తహశీల్దార్ శ్రీనివాసరావు

తాళ్లపూడి, ఫిబ్రవరి 27: ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకున్నా, ప్రలోభపెట్టినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల ప్రచురితమైన ఓటరు లిస్టుల్లో తప్పులుంటే సరిచేసుకోవచ్చని, 18 ఏళ్ల దాటిన వారు నూతనంగా ఓటును నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు గురిచేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, సమస్యాత్మక కేంద్రాలుగా ఉన్న తిరుగుడుమెట్ట, వేగేశ్వరపురం, మలకపల్లి గ్రామాల్లో పోలీసు బలగాలు అధికంగా ఉంటాయన్నారు. ఓటర్లు ఓటు వేయకుండా అడ్డుకోవడం, ప్రలోభాలకు గురి చేయడం వంటివి చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో నామన పరమేశ్వరరావు, యాళ్ల బాబూరావు, ఐతం మణికంఠ, ఇండగుల రామకృష్ణ, ఏఎస్‌వో జోడాల వెంకట్, ఆర్ఐ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు టీడీపీ సీటు శేషారావుకే కేటాయించాలి

సూర్యారావుపాలెం పంచాయతీ సభ్యులు



ఎమ్మెల్యే సీటు శేషారావుకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న పంచాయతీ సభ్యులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 27: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకే సీటు కేటాయించాలని మండలంలోని సూర్యారావుపాలెం గ్రామసర్పంచ్ మెండె లలిత కుమారి, ఉపసర్పంచ్ నందిన శ్రీనివాస్, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. 15 ఏళ్లుగా నియోజకవర్గానికి, ప్రజలకు సేవ చేస్తున్న వ్యక్తి శేషారావు అని, అన్ని సర్వేలు ఆయనకు అనుకూలంగా ఉన్నాయని, రెండో జాబితాలో ఆయన పేరును అధిష్ఠానం ప్రకటించాలని వారు కోరారు. సీటు కేటాయించకపోతే తమ పార్టీ పదవులకు, సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులకు రాజీనామాలు చేస్తామని వారు పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ-జనసేన ఉమ్మడి బహిరంగ సభకు తామంతా శేషారావు ఆధ్వర్యంలో వెళుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మగడ్డ మోహనరావు, కోనా ప్రసాద్, యాచిపూడి లీలాసత్యవేణి, అంబటి శివకృష్ణ, కరుటూరి మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడే టీడీపీ-జనసేన బహిరంగ సభ

» విజయవంతంత చేయండి: మాజీ మంత్రి సుజాత

బిక్కవోలు, ఫిబ్రవరి 27: తాడేపల్లిగూడెం సమీపంలోని పత్తిపాడులో బుధవారం నిర్వహించే టీడీపీ, జనసేన పార్టీల భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, నియోజకవర్గ పరిశీలకురాలు పీతల సుజాత పిలుపునిచ్చారు. బిక్కవోలులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన మండలంలోని టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు లక్ష్యానికి మించి కార్యకర్తలు, నేతలు హాజరు కావాలన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మన సభకు ప్రభుత్వం బస్సులు ఇవ్వడం లేదని, ప్రతిఒక్కరూ కార్లు, ద్విచక్రవాహనాల్లో సభకు రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, రేలంగి నాగేశ్వరరావు, పడాల వెంకటరామారెడ్డి, రావాడ నాగు పాల్గొన్నారు.

అనపర్తి: స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టీడీపీ-జనసేన బహిరంగ సభకు జనసమీకరణపై పార్టీ శ్రేణులతో చర్చించారు. ప్రత్తిపాడులో జరిగే బహిరంగ సభకు అనపర్తి నియోజకవర్గం నుంచి ఇరు పార్టీల శ్రేణులు అధిక సంఖ్యలో వెళ్లాలన్నారు. సమావేశంలో సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి



కొవ్వూరు సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు



బిక్కవోలులో మాట్లాడుతున్న పీతల సుజాత

సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, బాసి, ఓగిరెడ్డి సత్తిరెడ్డి పాల్గొన్నారు.

కొవ్వూరు: తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న జరగనున్న ఎన్నికల శంఖారావం బహిరంగ సభ విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశం కొవ్వూరులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను రాక్షసపాలన చెర నుంచి తప్పించడానికి టీడీపీ, జనసేన కలిసి పనిచేస్తోందన్నారు. వైసీపీ ఉచ్చులో టీడీపీ, జనసేన కార్యకర్తలు పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి టీవీ రామారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి, జగన్‌ను ఇంటికి తరిమి కొట్టడానికి కలసి పనిచేద్దామన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, జనసేన పట్టణాధ్యక్షుడు డేగల రాము తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: తాడేపల్లిగూడెంలో బుధవారం జరిగే టీడీపీ, జనసేన భారీ బహిరంగసభకు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలిరావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం 1గంటకు నాయకులు, కార్యకర్తలు వేలివెన్ను చేరుకోవాలని అక్కడి నుంచి భారీ ర్యాలీగా బహిరంగ సభకు వెళ్లనున్నట్టు చెప్పారు.

ఓటింగ్ శాతం పెరగాలి

» ఓటర్లలో అవగాహన పెంచాలి: కలెక్టర్

» దివాన్‌చెరువు, లాలాచెరువు ప్రాంతాల్లో పర్యటన

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలని, అందుకోసం ప్రతిఒక్క ఓటుహక్కును వినియోగించుకునేలా ఓటర్లలో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత సూచించారు. మంగళవారం ఆమె దివాన్‌చెరువు, లాలాచెరువు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గత ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా తక్కువ ఓటింగ్‌శాతం నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. రాజానగరం నియోజకవర్గం పరిధిలోని దివాన్‌చెరువు, లాలాచెరువు ఎంపీఈఎస్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ 65శాతం కంటే తక్కువగా నమోదైందని, ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు పర్యటించినట్టు కలెక్టర్ చెప్పారు. ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేందుకు తగిన



పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న కలెక్టర్ మాధవీలత

ప్రణాళికలు, కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి చైతన్యం తీసుకురావాలన్నారు. ఈవీఎంలపై అవగాహన కల్పించి, రాబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా సమన్వయంతో పనిచేయాలన్నారు. లాలాచెరువు పరిధిలోని 142, 143, 144, 146, 147, దివాన్‌చెరువు పరిధిలోని 136, 137 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతంపై బూత్‌వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీవో, రాజానగరం ఆర్‌వో ఏ.చైత్రవర్షిణి, తహశీల్దార్ జి.కనకరాజు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర

పవన్.. స్పందించాలి

» జగ్గంపేటలో నెహ్రూను ఎట్టి పరిస్థితిలో గెలవనివ్వం

» జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి పాటంశెట్టి

గోకవరం, ఫిబ్రవరి 27: టీడీపీ, జనసేన పార్టీల పొత్తు ధర్మాన్ని జగ్గంపేట నియోజకవర్గంలో పాటించబోమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. గోకవరం మండలం అచ్యుతాపురంలో సూర్యచంద్ర దంపతులు చేపట్టిన అంతిమ ఆమరణ నిరాహార దీక్ష మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గంలో టీడీపీకి జనసైనికులెవ్వరూ ఓట్లు వేయరన్నారు. తన వద్ద డబ్బులేని కారణంగా టిక్కెట్ నిరాకరించారని, అసంతృప్తితో దీక్ష చేస్తున్నప్పటికీ పొత్తు ధర్మాన్ని నేటి వరకు తప్పకుండా టీడీపీకి అనుకూలంగానే వ్యవహరించానన్నారు. తాము దీక్ష చేపట్టి నాలుగు రోజులు గడిచినా టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కనీసం పరామర్శించడానికి రాకపోవడం దారుణమన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జగ్గంపేట నుంచి పోటీ చేస్తే లక్ష ఓట్లు మెజార్టీతో గెలుపును బహుమతిగా ఇస్తానన్నారు. నెహ్రూను ఎట్టి పరిస్థితిలో గెలవనివ్వబోమని సూర్యచంద్ర ఉద్ఘాటించారు. తాను చేపట్టిన దీక్షకు పవన్‌కళ్యాణ్ స్పందించకపోతే దీక్షలోనే ప్రాణాలు విడుస్తానన్నారు. తనపై కొందరు ఎన్నారైలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారిచ్చిన ప్రతి పైసా పార్టీ అభ్యున్నతికే వెచ్చించానని, తన వద్ద లెక్క ఉందని చెప్పుకొచ్చారు.

సూర్యారావుపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 27: మండలంలోని సూర్యారావుపాలెంలో తణుకు మైత్రి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ తండ్రి నానాజి జ్ఞాపకార్థం చేపట్టిన ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న 100మందికి పరీక్షలు జరిపారు. 40మందికి కళ్లజోళ్లు, 21మందికి ఆపరేషన్లు చేయడానికి గుర్తించారు. ఆపరేషన్లు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. మరో 102మందికి జనరల్ పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గమిని గోపాలకృష్ణ, సర్పంచ్‌లు మెండె లలితకుమారి, నార్ని రామకృష్ణ, సభ్యులు బాలాజీ, ఐఎస్‌కె రాజు, సతీష్, నాగరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కొవ్వూరు, ఫిబ్రవరి 27: కొవ్వూరులోని దృష్టి ప్రదాత అంధుల పాఠశాల, వాత్సల్యా వృద్ధాశ్రమంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. కొవ్వూరు అవంతీ ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ జన్మదినం సందర్భంగా ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 16న రక్తదాన శిబిరం

తాళ్లపూడి, ఫిబ్రవరి 27: మార్చి 16న తాళ్లపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు సంఘం గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దన్, మండలాధ్యక్షుడు గోకవరపు బాబు తెలిపారు. మంగళవారం స్థానిక వెంకటేశ్వర రైస్‌మిల్లులో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నందన ఫౌండేషన్, దేవోక్తి సోషల్ సర్వీస్, జనహిత సేవా సమితి ప్రతినిధుల సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో గోకవరపు మాణిక్యం, అప్పన గుప్త, రవి, అలి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



సంఘటనా స్థలంలో నవీన్

కొవ్వూరు, ఫిబ్రవరి 27: ఎదుట వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు జారి పడి తలకు గాయాలై ఓ యువకుడు మృతి చెందినట్టు కొవ్వూరు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన కొడమంచిలి నవీన్(26) దేవరపల్లి మండలం బందపురంలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా మంగళవారం రాత్రి బైక్‌పై డ్యూటీకి బయలుదేరాడు. మార్గమధ్యలో దొమ్మేరు ఎన్‌సీఎల్ ఫ్యాక్టరీ సమీపంలో ఎదుట వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి బైక్ అదుపుతప్పి జారిపడింది. ఈ ప్రమాదంలో నవీన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

గోదావరి ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 27: కొవ్వూరు పట్టణ పరిధిలోని వాడపల్లి సమీపంలో గోదావరి లంకలో నది ఒడ్డున గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పట్టణ పోలీసులు మంగళవారం గుర్తించారు. సీఐ వి.జగదీశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లి, ఎండిపోయి ఉంది. మృతుడి జేబులో సెల్‌ఫోన్, చేతికి వాచీ ఉన్నాయన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రెండు నెలల క్రితం అదృశ్యమై..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం అదృశ్యమైన వ్యక్తి గోదావరిలో శవమై తేలాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం పీఅండ్‌టీ కాలనీకి చెందిన ఐ.కృష్ణ(35) వస్త్ర దుకాణంలో పని చేస్తు న్నాడు. రోజూ మాదిరిగానే గత ఏడాది డిసెంబరు 15న ఉద్యోగానికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో 16న మధ్యాహ్నం భార్య సత్యవేణి ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఉందని.. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ పేర్కొన్నారు.

తూర్పుకాపులకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాల

మంజూరుకు కృషి: రుడా చైర్మన్ రౌతు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: తూర్పుకాపు సంఘీయులకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు హామీ ఇచ్చారు. అనపర్తి నియోజకవర్గానికి చెందిన తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం సభ్యులు మంగళవారం రుడా కార్యాలయంలో రౌతును కలిసి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న తూర్పుకాపు సంఘీయులకు మాత్రమే ఓబీసీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సంఘీయులకు ఓబీసీ ధృవీకరణ పత్రాలకు నోచుకోవడం లేదని విన్నవించారు. దీనిపై స్పందించిన రౌతు మాట్లాడుతూ ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు లేక ఎంతోమంది తూర్పుకాపులు విద్య, ఉద్యోగ రంగాల్లో నష్టపోతున్నారన్నారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కొంకుదురులో తూర్పుకాపు విద్యవిజ్ఞాన అభివృద్ధి సంఘం కళ్యాణ మండపం నిర్మాణానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాజేష్, ఈశ్వర్, పోతు రాజు, కోన అర్జునుడు, ఎరువాడ శ్రీను, వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీలకు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం, కల్చరల్, ఫిబ్రవరి 27: గ్రామాల్లో ప్రాథమికంగా వైద్య సేవలందించే పీఎంపీలు వ్యాధులను గుర్తించడంలో అవగాహన మేలు చేస్తుందని ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ బలభద్ర వెంకటరాజు అన్నారు. మంగళవారం కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు హుకుంపేట సమీపంలోని గోదావరి రుచులు కాన్ఫరెన్స్‌లో అబ్దుల్ రహ మాన్ అధ్యక్షతన జరిగింది. సదస్సులో వెంకటరాజు మాట్లాడుతూ మెదడు సంబంధిత వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే చికిత్స అందించడం సులభమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, పి.దే వానందన, మట్టా రమేష్, యు.ప్రసాద్, ఎ.సురేష్‌బాబు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి: సీఐ

కడియం, ఫిబ్రవరి 27: గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు పోలీసుశాఖకు సహకరించాలని సీఐ బి.తులసీధర్ కోరారు. వేమగిరిలో సీఐ తులసీధర్, కడియపులంకలో ఎస్ఐ దుర్గాప్రసాద్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికి ఘర్షణలకు పోవద్దని, స్థానికంగా పరిష్కారం చేసుకోవాలని, యువత మాదకద్రవ్యాలకు జోలికి వెళ్లొద్దని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు పోయి కేసుల్లో ఇరుక్కోవద్దని చెప్పారు. ప్రతీ గ్రామంలో శాంతికమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

యువత దేశాభివృద్ధికి కృషిచేయాలి

యువసంవాద్@2047లో 'నన్నయ' వీసీ పద్మరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27: ప్రపంచంలోనే ఎక్కువ మంది యువత ఉన్న భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని, దేశాభివృద్ధిలో యువత కీలకపాత్రను పోషించాలని వైస్ చాన్సలర్ కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువసంవాద్ ఎట్ 2047 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దీనికి యూనివర్శిటీ వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన పంచప్రాణ్ సూత్రాలను పాటిస్తే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, డీన్స్ ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య పి.సురేష్‌వర్మ, కన్వీనర్ ఎం.గోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవోలు తదితరులు పాల్గొన్నారు.

టెలికాం హక్కులపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి

రాజానగరం, ఫిబ్రవరి 27: టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, అధికారాలపై తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐటీఎస్ ప్రాంతీయ కార్యాలయ సలహాదారు బి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించడంలో తమ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలన్నారు. పలు రాష్ట్రాల్లో ప్రాంతీయ కార్యాలయాల పాత్ర, విధులు, టెలికాం వినియోగదారుల రక్షణకు చేపడుతున్న చర్యలను వివరించారు. ట్రాయ్ నిబంధనలు, మొబైల్ నెంబర్ల పోర్టబులిటీ, అన్‌సోలిసిటెడ్ కమర్షియల్ కమ్యూనికేషన్స్, కంప్లైంట్ రిడ్రెసల్ మెకానిజం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే రేడియేషన్, డిజిటల్ మోసాలు, ఈఎంఎఫ్ రేడియేషన్, 5జీ టెక్నాలజీ, వినియోగ కేసులు, సైబర్ మోసాలను డాట్ డైరెక్టర్ జీవీ మనోజ్‌కుమార్ వివరించారు. సీనియర్ సైబర్ నిపుణులు, రాజమండ్రి సైబర్ సెల్ వైఎస్‌వీ సురేష్ డిజిటల్ మోసాలు, భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఎస్ కళాశాల చైర్మన్ కల్లెం ఉపేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజశ్రీరావు, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ ఎం.వెంకటపతి, కార్యక్రమ ఇన్‌చార్జ్ ఎం.నరసింహారావు, సిబ్బంది, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు, వినియోగదారుల ఫోరంల ప్రతినిధులు పాల్గొన్నారు.

వడిశలేరు సర్పంచ్ ఎన్నికపై పిటిషన్ కొట్టివేత

రంగంపేట, ఫిబ్రవరి 27: మండలంలోని వడిశలేరులో 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికైన కొల్లాటి శ్యామలావతి ఎన్నిక చెల్లదంటూ శ్యామలావతిపై పోటీ చేసి ఓటమి చెందిన పోతుల ఉషారాణి వేసిన పిటిషన్‌ను పెద్దాపురం మున్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొట్టువేశారని న్యాయవాది దుర్గారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1995లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీ మహిళ అభ్యర్థి గాను, 2021లో జరిగిన ఎన్నికల్లో ఎస్సీ మహిళ అభ్యర్థిగా పోటీడాన్ని వ్యతిరేకిస్తూ పోతుల ఉషారాణి వేసిన దాఖలు పిటిషన్‌ను కొన్ని సాంకేతిక కారణాలు చూపుతూ కొట్టి వేసినట్టు చెప్పారు.

జీజీయూ ఆవిర్భావ వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైతన్యరాజు

రాజానగరం, ఫిబ్రవరి 27: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించడం, వారిని అభివృద్ధి పథంలో పయనింపచేయడమే గైట్ గ్లోబల్ యూనివర్శిటీ(జీజీయూ)ప్రధాన ఉద్దేశ్యమని గైట్ గ్లోబల్ యూనివర్శిటీ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు), ప్రోఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ అన్నారు. గైట్ కళాశాల జీజీయూ ఆవిర్భావ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్యరాజు మాట్లాడుతూ గైట్ కళాశాల చరిత్రలో నూతన శకం ప్రారంభమైందని, అధ్యాపకులు నిరంతరం తమ విజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, ప్రిన్సిపాల్స్ పీఎంఎంఎస్ శర్మ, ఎంవీఎస్ బాబు, ఎండీ ధనరాజు, పీజీ రామానుజం, కె.వల్లీమాధవి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

గైట్ ఎన్ఎస్ఎస్ పీవోకు వలంటీర్ హీరో అవార్డు

సామాజిక సేవా పురస్కారాలు 2022-23 సంబంధించి గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ మీరాకు వాలంటీర్ హీరో అవార్డు లభించింది. ఈమేరకు ఫిబ్రవరి 24న ముంబైలోని ఓహోటల్‌లో బాలీవుడ్ నటి శ్రియా ఫిల్గాష్కర్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.. అలాగే వలంటీర్లు పి.సుచిత్ర, జి.సాయి శశాంక్, కె.లక్ష్మీ లాలిత్యలకు యూత్ చాంపియన్ అవార్డును ప్రభాత్‌పాణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ సస్టెయి నబుల్ డెవలప్‌మెంట్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు గ్రహీతలను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, యాజమాన్యం అభినందించింది.

మల్లిబాబు ఆర్థిక సాయం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 27: ఇటీవల మృతిచెందిన పల్లకడియం టీడీపీ నాయకుడు గుత్తుల ఆదినారాయణ కుమార్తెల చదువు నిమిత్తం దివాన్ చెరువుకు చెందిన రాష్ట్ర టీడీపీ సాధికారసమితి గౌడ డైరెక్టర్ వంక మల్లికార్జునస్వామి(మల్లిబాబు) రూ.25 వేల చెక్కును టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరికి మంగళవారం అందజేశారు. ఈ విషయాన్ని మంగళవారం మల్లిబాబు విలేకరులకు తెలిపారు. తన తండ్రి దివంగత వంక సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఈ ఆర్థిక సాయం అందజేసినట్టు చెప్పారు.

వైసీపీకి యిన్నమూరి దీపు రాజీనామా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 27: వైసీపీ నాయకుడు, ఉమామా ర్కం డేయేశ్వర దేవస్థానం చైర్మన్ యిన్నమూరి దీపు తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆ పార్టీ జి ల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కు లేఖ పంపించారు. గతంలో టీడీపీలో ఉన్న దీపు దానికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. వ్యక్తిగత కారణాలతో తన రాజీనామాను ఆమోదించాలని దీపు కోరారు.

దస్తావేజు పోయినది

ప॥గో॥జిల్లా, తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామ కాపురస్తులు **దండుబోయిన నాగ విజయ** W/o **నరసింహారావు** కు సంబంధించి డాక్యుమెంట్ నెం.199/2012 తాళ్ళపూడి మండలం అన్నదేవరపేట నుండి మాధవరం వస్తుండగా మార్గం మధ్యలో ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైన దొరికినయెడల సంప్ర: 88250 79250.